రెండు రోజుల్లో 32 శాతం రేషన్ పంపిణీ



కోట్నివీధి రేషన్ షాపు డీలర్‌తో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

- కలెక్టర్ విజయకృష్ణన్
- దివ్యాంగులు, వయోవృద్ధులకు ఐదో తేదీలోగా ఇళ్లవద్దకే సరుకులు

అనకాపల్లి టౌన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రేషన్ డిపోల్లో రెండు రోజుల్లోనే 32 శాతం కార్డులకు సరుకులు పంపిణీ చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మంగళవారం ఉదయం జీవీఎంసీ 84వ వార్డు కోట్నివీధి 15వ నంబరు ... మిగతా 8వ పేజీలో

వైభవంగా మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర



మోదకొండమ్మ అమ్మవారిని దర్శించుకున్న ఎంపీ సీఎం రమేశ్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ చైర్మన్ బత్తుల తాతయ్యబాబులను సత్కరించి జ్ఞాపికను అందిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు

మాడుగుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర మహోత్సవం మంగళవారం అత్యంత వైభవంగా జరిగింది. తెల్లవారుజామునే అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు దర్శనాలు ప్రారంభించారు. స్థానికులతోపాటు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, స్థానిక ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, పలువురు కూటమి నాయకులు మోదకొండమ్మను దర్శించుకుని పూజలు చేశారు. స్థానిక మహిళలు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు. నెల రోజుల క్రితం శతకంపట్టు వద్ద కొలువుతీరిన అమ్మవారి పాదాలు, ఘటాలను ఊరేగింపుగా తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు.

జిల్లాలో ఆటిజం కేంద్రాలు

నర్సీపట్నం, ఎలమంచిలిలో ఏర్పాటుకు ప్రభుత్వం ఆదేశాలు

- ఒక్కో కేంద్రానికి రూ.27 లక్షల చొప్పున నిధులు
- భవన నిర్మాణం, బోధకుల నియామకం, పరికరాలు సమకూర్చే పనిలో సమగ్ర శిక్ష అధికారులు



ఆటిజం రుగ్మతతో బాధపడుతున్న విద్యార్థులు (ఫైల్ ఫొటో)

అనకాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఆటిజం రుగ్మతతో బాధపడే నిరుపేద కుటుంబాల్లోని అభాగ్యులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో రెండు ఆటిజం కేంద్రాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు జిల్లా విద్యా శాఖకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ కేంద్రాలను నర్సీపట్నం, ఎలమంచిలిల్లో ఏర్పాటు చేయడానికి సన్నద్ధం అవుతున్నారు.

ఆటిజం బారినపడిన చిన్నారుల్లో అనేక ఇబ్బందులు ఎదురవుతాయి. సమస్య ఇదీ అని చెప్పలేని పరిస్థితి. ఒక్కో చిన్నారిలో ఒక్కోరకమైన ఇబ్బందులు కనిపిస్తాయి. ఇది ప్రవర్తనలో మార్పులతో కూడిన వ్యాధిగా చెప్పవచ్చు. శరీరంలోని కొన్ని భాగాల్లో ఎదుగుదల తక్కువగా ఉంటుంది. సాధారణ పిల్లలతో పోలిస్తే ఆటిజం బారినపడిన చిన్నారుల వ్యవహారశైలి భిన్నంగా ఉంటుంది. ఆటిజం బారినపడిన చిన్నారుల్లో కొన్ని లక్షణాలను గుర్తించేందుకు అవకాశం ఉంది. ఎవరితోనూ కలవకపోవడం, నేరుగా కళ్లల్లోకి చూడలేకపోవడం, శబ్దాలను పట్టించుకోకపోవడం, పిలిచినా పలకకపోవడం, ఒంటరిగా ఆడుకోవడం, చేసిన పనులనే మళ్లీమళ్లీ చేస్తుండడం, హైపర్ యాక్టివ్‌గా ఉండడం, ఎక్కువ ఆందోళనకు గురవుతుండడం, వింత శబ్దాలు చేయడం, అకస్మాత్తుగా కోపం రావడం వంటి లక్షణాలుంటాయి. అయితే సమస్యపట్ల తల్లిదండ్రుల్లో అవగాహన లేకపోవడంతో గుర్తించడం ఆలస్యమవుతున్నది. ఆటిజాన్ని స్పెక్ట్రమ్ డిజార్డర్ అని. న్యూరల్ బిహేవియర్ డిజార్డర్ అని చెబుతుంటారు. ఆటిజంతో బాధపడుతున్న చిన్నారుల సంఖ్య గణనీయంగా పెరుగుతుండడం సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తున్నది. అమెరికా వంటి అభివృద్ధి చెందిన దేశంలో 20 శాతం ఆటిజం కేసులు నమోదవుతుండగా, అభివృద్ధి చెందుతున్న మన దేశంలో ఐదు శాతానికిపైగానే నమోదవుతున్నట్టు చెబుతున్నారు. ఆటిజం సమస్య జన్యుపరమైన కారణాల వల్ల వస్తుందని వైద్య నిపుణులు చెబుతున్నారు. గర్భధారణ సమయంలో ఇన్‌ఫెక్షన్ల బారిన పడినా, గర్భిణిగా ఉన్నప్పుడు తీవ్రమైన ఉద్వేగాలకు లోనైనా పుట్టే పిల్లలకు ఆటిజం వచ్చే అవకాశం ఉంది. పిల్లల్లో మెదడు ఎదుగుదలకు తోడ్పడే జన్యువులు, అందులో స్రవించే సెరటోనిన్, డోపమైన్ వంటి రసాయనాలు తగినంత విడుదల కాకపోయినా, నెలలు నిండకుండా జన్మించినా, బాల్యంలో పిల్లలతో తల్లిదండ్రులు ఎక్కువ సమయం గడపకపోయినా, స్క్రీన్ టైమ్, ఇంట్లో పిల్లలు ఒంటరిగా ఉన్నా దీని బారినపడే ప్రమాదం ఉందని చెబుతున్నారు. ఆటిజం బారినపడిన చిన్నారులకు లక్షణాలనుబట్టి మైల్డ్, మోడరేట్, సివియర్‌గా విభజించి వైద్య సేవలు అందిస్తారు. స్క్రీనింగ్ చేసి విభజిస్తారు. సమస్య తీవ్రతను బట్టి స్పీచ్ థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషన్, ఆక్యుపేషనల్ థెరపీ, సెన్సార్ స్టిములేషన్ వంటి పద్ధతులను అనుసరించి సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తారు. ఆటిజం బాధిత చిన్నారులకు విద్యా బుద్ధులు ... మిగతా 8వ పేజీలో

వాక రోడ్డుకి మోక్షం

రామన్నపాలెం టు పెద్దపల్లి.. వయా ఎరకన్నపాలెం

- స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రతిపాదనలతో ప్రభుత్వ సానుకూల స్పందన
- క్షేత్రస్థాయిలో పరిశీలించిన కలెక్టర్ విజయకృష్ణన్
- 11 కిలోమీటర్ల పొడవున 40 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మిస్తామని వెల్లడి
- మాకవరపాలెం-ఎలమంచిలి మధ్య సగానికిపైగా తగ్గనున్న దూరం

మాకవరపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): **మండల ప్రజలు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న రామన్నపాలెం జంక్షన్ నుంచి ఎరకన్నపాలెం మీదుగా ఎలమంచిలి మండలం పెద్దపల్లి వరకు రోడ్డు నిర్మాణం త్వరలో ప్రారంభం కానున్నది. సుమారు 40 అడుగుల వెడల్పుతో నిర్మించే ఈ రహదారి అందుబాటులోకి వస్తే.. పలు మండలాలకు చెందిన వివిధ గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపై ఎలమంచిలి వైపు రాకపోకలు సాగించడానికి అనువుగా వుంటుంది. ప్రయాణ దూరం కూడా తగ్గుతుంది.**



ఎరకన్నపాలెం నుంచి పెదపల్లికి అటవీ భూముల్లో నుంచి వెళ్లే వాక రోడ్డు

నర్సీపట్నం, మాకవరపాలెం, రోలుగుంట, రావికమతం మండలాలకు చెందిన పలు గ్రామాల ప్రజలు ఎలమంచిలి, అచ్యుతాపురం, రాంబిల్లి, ఎస్.రాయవరం మండలాలకు రావాలంటే కోటవురట్ల మండలం తాళ్లపాలెం మీదుగా ప్రయాణించాలి. మాకవరపాలెం మండల కేంద్రం నుంచి ఎలమంచిలికి సుమారు 25 కిలోమీటర్ల దూరం వుంటుంది. అయితే నర్సీపట్నం- తాళ్లపాలెం రోడ్డులో మాకవరపాలెం మండలంలోని రామన్నపాలెం జంక్షన్ నుంచి ఎరకన్నపాలెం, పెద్దపల్లి మీదుగా ఎలమంచిలి వెళ్లడానికి దగ్గరదారి. దీనిని వాక రోడ్డు అని పిలుస్తుంటారు. మధ్యలో ... మిగతా 8వ పేజీలో



ఏపీఐఐసీ అభివృద్ధి చేయనున్న రామన్నపాలెం నుంచి ఎరకన్నపాలెం వెళ్లే రోడ్డు

నత్తనడకన రోడ్ల పనులు

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో పది పనులకు ఎన్‌డీబీ నుంచి రూ.220 కోట్ల రుణం

- నాలుగేళ్లయినా పది శాతం కూడా పూర్తికాని వైనం
- ఇప్పటివరకూ కేవలం రూ.24.56 కోట్ల విలువైన పనులు మాత్రమే పూర్తి
- రద్దయ్యే ప్రమాదం



బీఎన్ రోడ్డులో చోడవరం పట్టణంలోని కొత్తూరు జంక్షన్ వద్ద ఏర్పడిన భారీ గొయ్యి

విశాఖపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో న్యూ డెవలప్‌మెంట్ బ్యాంకు (ఎన్‌డీబీ) రుణంతో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో చేపట్టిన పది రహదారుల పనులు నత్తనడకన సాగుతున్నాయి. రోడ్లు, భవనాల శాఖ పరిధిలో గల ఈ రహదారుల పునర్నిర్మాణానికి 2021లో టెండర్లు ఆహ్వానించగా, రాయలసీమ ప్రాంతానికి చెందిన ఒక సంస్థ పనులను దక్కించుకుంది. అయితే, కొన్ని నెలలపాటు పనులు ప్రారంభించలేదు. ఒక మంత్రి సూచనతో ఎన్నికలకు కొన్ని నెలల ముందు పనులను మొదలెట్టింది. అయినా ఇప్పటికీ పది శాతం కూడా పూర్తికాలేదు. మొత్తం ఎన్‌డీబీ ... మిగతా 8వ పేజీలో

ఇవీ పనులు వివరాలు..

రోడ్డు	కిలోమీటర్లు	మంజూరైన నిధులు(రూ.కోట్లు)	పూర్తయిన పనుల విలువ(రూ.కోట్లు)
భీమునిపట్నం-నర్సీపట్నం	10.85	రూ.31.45	రూ.0.92
విజయనగరం-పద్మనాభం-శొంఠ్యాం	3.55	రూ.10.04	రూ.2.21
అనకాపల్లి-వెంకన్నపాలెం	5.03	రూ.12.33	రూ.0
సింహాచలం-పినగాడి	7.13	రూ.13.92	రూ.0.62
నర్సీపట్నం-రేవుపోలవరం	9.6	రూ.20.78	రూ.0.15
పాడేరు-పెదబయలు-ముంచంగిపుట్టు	4.98	రూ.11.71	రూ.7.60
నర్సీపట్నం-చింతపల్లి-సీలేరు	1.00	రూ.2.57	రూ.0
వడ్డాది-పాడేరు రోడ్డు	12.7	రూ.23.59	రూ.0.9
భీమునిపట్నం-నర్సీపట్నం రోడ్డు	28.6	రూ.79.81	రూ.10.73
నర్సీపట్నం-తుని రోడ్డు	4.3	రూ.14.42	రూ.1.43

బొగ్గు లారీ బీభత్సం

కారు, ఆటోను ఢీకొనడంతో నలుగురికి గాయాలు

- డ్రైవర్ నిద్రమత్తు కారణంగానే ప్రమాదం



డివైడర్‌పైకి దూసుకుపోయిన బొగ్గు లారీ. (ఇన్‌సెట్‌లో) లారీ ఢీకొనడంతో దెబ్బతిన్న ఆటో

లంకెలపాలెం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై లంకెలపాలెం కూడలిలో మంగళవారం ఉదయం బొగ్గు లోడుతో వెళుతున్న లారీ బీభత్సం సృష్టించింది. ఈ ప్రమాదంలో ఒకరికి తీవ్రగాయాలు, మరో ముగ్గురికి స్వల్పగాయాలు అయ్యాయి. ఇందుకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలావున్నాయి. గంగవరం పోర్టులో బొగ్గును లోడ్ చేసుకున్న లారీ అచ్యుతాపురం బయలుదేరింది. మంగళవారం ఉదయం ఆరు గంటల సమయంలో లంకెలపాలెం కూడలి వద్దకు చేరిన లారీ.. ఫ్రీ లెఫ్ట్‌కు వెళ్లాలి. కానీ డ్రైవర్ నిద్ర మత్తు కారణంగా నేరుగా వెళ్లి ముందు వెళుతున్న కారును, అనకాపల్లి నుంచి వస్తున్న ఆటోను బలంగా ఢీకొట్టింది. అంతటితో ఆగకుండా డివైడర్‌పైన వున్న సిగ్నల్ లైట్లు, హైమాస్ట్ స్తంభాన్ని ఢీకొన్ని రెయిలింగ్ పైకి దూసుకుపోయింది. ఆటోలో ప్రయాణిస్తున్న అక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన ఎన్.ఆదిలక్ష్మి, జి.దేముడమ్మ, ఎన్.నూకాలమ్మ, డొంకాడకు చెందిన ఆటో డ్రైవర్ సీతారాములకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం అగనంపూడి ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆదిలక్ష్మికి తీవ్రగాయాలు కావడంతో మెరుగైన వైద్యం కోసం కేజీహెచ్‌కు తరలించారు. ప్రమాదానికి కారణమైన లారీ డ్రైవర్ పరారయ్యాడు. జనసంచారం లేని సమయంలో ప్రమాదం జరగడంతో ప్రాణనష్టం వాటిల్లలేదని, అదే మరో రెండు గంటల తరువాత జరిగి వుంటే పరిస్థితి మరోలా వుండేదని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్రేన్‌ను రప్పించి లారీని పక్కకు తీయించారు. ప్రమాదం కారణంగా కొద్దిసేపు ట్రాఫిక్ నిలిచిపోయింది.



నాతవరంలో నిర్వహిస్తున్న జిల్లాస్థాయి ఎండ్లబండ్ల పోటీలను తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలివచ్చిన ప్రజలు

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఎండ్లబండ్ల పోటీలు

- లెక్కలవానిపాలెం ఎండ్లబండికి ప్రథమ బహుమతి

నాతవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కోటమ్మతల్లి జాతరను పురస్కరించుకుని నాతవరంలో మంగళవారం జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను తిలకించడానికి స్థానికులతోపాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. జిల్లాస్థాయి ఎడ్లబండ్ల పోటీల్లో లెక్కలవానిపాలేనికి చెందిన పెద్ద పైడితలమ్మ ఎండ్లబండి ప్రథమ స్థానంలో నిలిచింది. నాతవరానికి చెందిన అంకంరెడ్డి గోవిందు ఎడ్లబండి రెండో స్థానంలో, ఎల్‌బీపట్నానికి చెందిన బండారు హిమతేజ ఎడ్లబండి మూడు స్థానంలో నిలిచాయి. విజేతలకు వరుసగా రూ.15 వేలు, రూ.12 వేలు, రూ.10 వేలు నగదు బహుమతులతోపాటు షీల్డులను కోటమ్మతల్లి ఉత్సవ కమిటీ సభ్యులు అందజేశారు.

ఏడాదిలో 70 శాతం హామీల అమలు

- ఇదీ కూటమి ప్రభుత్వం ఘనత
- రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ



ఎలమంచిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి బుధవారానికి ఏడాది కాలం పూర్తయిందని, ఈ ఏడాది కాలంలో 70 శాతం హామీలను నెరవేర్చిందని రాష్ట్ర రోడ్ల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుంభకోణాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించడానికి వైసీపీ నేతలు డ్రామాలు ఆడుతున్నారని విమర్శించారు. గత వైసీపీ ప్రభుత్వం తొలి ఏడాదిలో 10 శాతం హామీలు కూడా అమలు చేయలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే ప్రజారంజక పాలన అందించడం జరిగిందన్నారు. గత వైసీపీ ప్రభుత్వం 85 శాతం హామీలకు ఎగనామం పెట్టిందని విమర్శించారు. మద్యపానం నిషేధమని చెప్పి, నాణ్యతలేని మద్యాన్ని పేద ప్రజలకు అందించారన్నారు. నిరుద్యోగులకు మెగా డీఎస్సీ అని హామీ ఇచ్చి వెన్నుపోటు పొడిచారని ఆరోపించారు. అన్న క్యాంటీలను రద్దు చేసి పేదలకు పట్టెడన్నం దూరం చేశారని, సబ్‌ప్లాన్ నిధులు దారి మళ్లించి, సామాజిక న్యాయానికి వెన్నుపోటు పొడిచారన్నారు. ప్రభుత్వం ఏర్పడిన మొదటి నెలలోనే పెన్షన్ పెంచి ఇస్తామని చెప్పి ఐదేళ్లు పెంచుకుంటూ ప్రజలకు వెన్నుపోటు పొడిచారని విమర్శించారు. కోట్లాది రూపాయల ప్రభుత్వ నిధులు పక్కదారి పట్టాయని, ప్రజలకు అన్ని విధాలా వెన్నుపోటు పొడిచారన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలనను చూసి ఓర్వలేక విమర్శలు చేస్తున్నారని ప్రగడ నాగేశ్వరరావు మండిపడ్డారు.

కూటమి ఏడాది పాలనను పండగలా నిర్వహించాలి

కూటమి నేతలకు ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపు



కూటమి నేతలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

రాంబిల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది సుపరిపాలన వేడుకలను బుధవారం పండగలను తలపించే విధంగా నిర్వహించాలని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం హరిపురం జనసేన పార్టీ కార్యాలయంలో నాలుగు మండలాల కూటమి నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం సుపరిపాలన అందిస్తున్నదన్నారు. రాష్ట్రంలో అరాచక పాలన సాగించిన వైసీపీ మూకలను రాష్ట్ర ప్రజలు తరిమేసి ఏడాది పూర్తయ్యిందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌ల నాయకత్వంలో కూటమి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలనను ప్రజలు ఆదరించి, ఆశీర్వదిస్తున్నారన్నారు. మహిళలకు గ్రామాల్లో ముగ్గుల పోటీలు నిర్వహించాలన్నారు. సమావేశంలో నాలుగు మండలాలకు చెందిన కూటమి నేతలు వి.దిన్‌బాబు, పప్పల నూకన్నదొర, బి.శ్రీరామదాసు, జనపరెడ్డి శ్రీనివాసరావు,దొడ్డి శ్రీను, పరశురాం, అన్నం బాబ్జి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

9న యోగాంధ్రను విజయవంతం చేయండి

రాంబిల్లి మండలంలోని కొత్తూరు బౌద్ధక్షేత్రం ఆవరణలోని ధనదిబ్బలు వద్ద ఈనెల 9వ తేదీన నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం కొత్తూరులో నియోజకవర్గంలోని నాలుగు మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవోలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమం రెండు వేల మందితో జరగనుందన్నారు. కొత్తూరు వద్ద ట్రాఫిక్ సమస్య లేకుండా చూడాలని పోలీసులను ఆదేశించారు. అంబలి, మొలకలతోపాటు అల్పాహారాన్ని కూడా సిద్ధం చేయాలన్నారు. సమావేశంలో డీపీవో ఆర్.శిరీషారాణి, డీఎల్‌పిఓ ఎస్ఎస్ఎస్ మూర్తి, అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అభివృద్ధిపై చర్చకు రండి?

- వైసీపీ నేతలకు లాలం సవాల్



కోటవురట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలుపై వైసీపీ నాయకులు చర్చకు రావాలని టీడీపీ జిల్లాప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు సవాల్ విసిరారు. మంగళవారం జల్లూరు క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో 85 శాతం హామీలు ఎగనామం పెట్టి ప్రజలకు వెన్నుపోటు పొడిచిందని ఆరోపించారు. వైసీపీ ఐదేళ్లలో చేసిన అభివృద్ధికి కూటమి ప్రభుత్వం ఏడాదిలో చేసిన అభివృద్ధిపై చర్చిద్దామా అని సవాల్ విసిరారు. వైసీపీ ప్రభుత్వం రైతులకు పెట్టిన రూ.1,674 కోట్ల బకాయిలను కూటమి ప్రభుత్వం చెల్లించిందన్నారు. ధాన్యం కొనుగోళ్ళ, జగనన్నకాలనీ లేఅవుట్, పక్కాగృహాల మంజూరులో భారీ ఎత్తున దోపిడీ జరిగిందని ఆరోపించారు. ఐదేళ్ల గాలికి వదిలేసిన రోడ్లను ఏడాదిలో రూ.1,200 కోట్లతో గుంతలు పూడ్చే కార్యక్రమం చేపట్టామన్నారు. మత్స్యకారుల ఉపాధిని దెబ్బతీసే 217 జీవో రద్దు చేసి, వారికి వేట నిషేధ భృతిని రూ.20 వేలు అందజేశామన్నారు. ఎస్టీ, ఎస్సీ, బీసీ మైనార్టీ సబ్‌ప్లాన్ నిధులు లక్ష కోట్లు దారి మళ్లించి సామాజిక న్యాయానికి వైసీపీ నేతలు వెన్నుపోటు పొడించారని లాలం కాశీనాయుడు ఆరోపించారు.

మంత్రి అనితను కలిసిన 'పెట్ల' దంపతులు



మంత్రి అనితకు మొక్కను అందిస్తున్న లింగంనాయుడు భార్య

కోటవురట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): టీడీపీ మండల అధ్యక్షులు పెట్ల లింగంనాయుడు దంపతులు మంగళవారం విజయవాడలో హోంమంత్రి వంగలపూడి అనిత క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి నుంచి బలోపేతం చేయాలని సూచించారు. రానున్నసంస్థాగత ఎన్నికలపై దృష్టి పెట్టాలన్నారు. అనంతరం మండలంలో ప్రధానమైన సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

మా సమస్యను తీర్చండి

- కూటమి నేతలకు గొరపూడి రైతుల వినతి



అనకాపల్లిలో సీఎం రమేశ్, బత్తుల తాతయ్యబాబు, ప్రగడ నాగేశ్వరరావులను కలిసిన గొరపూడి రైతులు

రాంబిల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడి పంచాయతీకి చెందిన రైతులు మంగళవారం అనకాపల్లిలో ఎంపీ సీఎం రమేశ్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరావులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పంచాయతీలోని సమస్యలపై వినతిపత్రాలను అందజేశారు. ఎస్ఈజడ్‌కు తమ పంచాయతీలోని భూములు ఇవ్వమని రైతులంతా తీర్మానం చేసుకొని పలుమార్లు ఏపీఐఐసీ, రెవెన్యూ అధికారులకు వినతిపత్రాలు అందజేశామని, అయినా భూములు ఇవ్వాలని వారు బెదిరిస్తున్నారని గొరపూడి రైతులు తెలిపారు. రైతులకు నష్టం కలిగించే పనులు ప్రభుత్వం ఏమాత్రం చేయబోదని, త్వరలోనే ఈ సమస్యను పరిష్కరిస్తానని సీఎం రమేశ్ హామీ ఇచ్చారని రైతులు లాలం తాతబాబు, నెక్కల నర్సింగరావు, లాలం రవికుమార్, లాలం రమణ, గొల్లి సతీష్, తదితరులు తెలిపారు.

త్వరితగతిన ప్రహరీ నిర్మాణం : ఆడారి ఆనంద్

మునగపాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక తులసీ కల్యాణ మండపం వద్ద ప్రహరీ నిర్మాణ పనులు త్వరితగతిన చేపట్టాలని విశాఖ డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్ తెలిపారు. మంగళవారం మండపం వద్ద ప్రహరీ నిర్మాణ పనులకు ఆయన భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని దివంగత ఆడారి తులసీరావు మారుమూల గ్రామాల్లో సైతం కల్యాణ మండపాలు నిర్మించారన్నారు. ఆనంద్‌ను గజమాలతో రైతులు సత్కరించారు. కార్యక్రమంలో పాలసొసైటీ అధ్యక్షుడు మళ్ల సంజీవరావు, పీఏస్. పెంటకోట సత్యనారాయణ, జనసేన మండల అధ్యక్షుడు టెక్కలి పరశురాం, పలు సొసైటీల అధ్యక్షులు మొల్లేటి సత్యనారాయణ, నబ్బి శ్రీను, డెయిరీ మేనేజర్ రమణ, వెలగా సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

నేడు ఎస్పీ బాలు రాష్ట్ర స్థాయి పాటల పోటీలు

ఎలమంచిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిపట్టణంలో బుధవారం ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా రాష్ట్ర స్థాయి పాటల పోటీల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేశామని కమిటీ చైర్మన్ మత్తుర్తి రామారావు తెలిపారు. పట్టణంలోని గురవప్ప కల్యాణ మండపంలో ఉదయం 8 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభం కానుందని, స్త్రీ, పురుషులకు పాటల పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం 5 గంటలకు స్థానిక కళాకారులతో ఎస్పీ. బాలు సంగీత విభావరిని నిర్వహిస్తామన్నారు. అనంతరం పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తామన్నారు.

నేటి వెన్నుపోటు దినాన్ని విజయవంతం చేయండి

- మాజీ ఎమ్మెల్యేలు ధర్మశ్రీ, కన్నబాబు



విలేకర్లతో మాట్లాడుతున్న ధర్మశ్రీ, కన్నబాబు

ఎలమంచిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో బుధవారం వైసీపీ నిర్వహించ తలపెట్టిన వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని పార్టీ శ్రేణులంతా విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యేలు కరణం ధర్మశ్రీ, యూవీ రమణమూర్తిరాజు పిలుపునిచ్చారు. మంగళవారం కన్నబాబు క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఏడాది పాలనలో నెరవేర్చక పోగా.. ఆటవిక పాలన సాగిస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ శాంతియుతంగా చేపట్టే ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ శ్రేణులంతా కలిసి రావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు సంధ్యారాణి, మునిసిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ నాగేశ్వరరావు, ఆరెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తా, మునిసిపల్ కోఆప్షన్ సభ్యుడు దూది నరసింహమూర్తి పాల్గొన్నారు.

వెన్నుపోటు దినం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ విడుదల చేస్తున్న వైసీపీ నాయకులు

పాయకరావుపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు అమలు చేయనందుకు నిరసనగా బుధవారం పాయకరావుపేటలో నిర్వహించనున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని వైసీపీ శ్రేణులు జయప్రదం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు చిక్కాల రామారావు విజ్ఞప్తిచేశారు. మంగళవారం ఇక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వెన్నుపోటు దినం పోస్టర్‌ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో అధికారం చేపట్టి ఏడాది కావస్తున్నా ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు అమలు చేయలేదన్నారు. నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి కంబాల జోగులు ఆధ్వర్యంలో ఉదయం 9 గంటలకు పాత పంచాయతీ కార్యాలయం ఎదుట వైఎస్ఆర్ విగ్రహం వద్ద నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యులు లంక సూరిబాబు, వైసీపీ నాయకుడు ధనిశెట్టి బాబూరావు, వైసీపీ పట్టణ అధ్యక్షుడు ధనిశెట్టి బాబి, నాయకులు దగ్గుపల్లి సాయిబాబా, ఇసరపు తాతారావు, జగతా శ్రీను పాల్గొన్నారు.

నేడు పోటాపోటీ కార్యక్రమాలు

- ఏడాది సంబరాలకు కూటమి శ్రేణులు
- వెన్నుపోటు దినం పేరుతో వైసీపీ నిరసనలు

మునగపాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్న సందర్భంగా ఈనెల 4వ తేదీన కూటమి శ్రేణులు సంబరాలు నిర్వహిస్తుండగా.. వెన్నుపోటు దినంగా నిరసన తెలిపేందుకు వైసీపీ సిద్ధపడుతోంది. ఏడాది పాలన ప్రజారంజకంగా జరిగినందున బుధవారం మండల కేంద్రం మునగపాకతోపాటు పలు గ్రామాల్లో సంబరాలకు టీడీపీ మండల అధ్యక్షుడు పెంటకోట విజయ్, జనసేన పార్టీ నాయకుడు వేగి కృష్ణ వేర్వేరుగా పిలుపునిచ్చారు. మహిళలకు ముగ్గులు పోటీలు, కోలాటం, సాముగరిడీ వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయని కృష్ణ తెలిపారు. హామీలను అమలు చేయడంలో కూటమి ప్రభుత్వం వైఫలం చెందిందని, ఏడాది పాలనపై వెన్నుపోటు దినం పేరుతో నిరసన ర్యాలీ చేపట్టి, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తామని వైసీపీ అరకు పార్లమెంటు పరిశీలకుడు బొడ్డేడ ప్రసాద్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చాడు.

భానుడి భగభగలు

నక్కపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గత రెండు రోజుల నుంచి సూరీడు ఠారెత్తిస్తున్నాడు. ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ ఎండ తీవ్రత, ఉక్కబోత ఎక్కువగా వుంటుంది. మంగళవారం నిప్పుల కుంపటిగా మారిపోయింది. ఉక్కబోతతో ప్రజలు విలవిల్లాడారు. మరో వారం రోజులపాటు వేసవి తాపం ఇలాగే వుంటుందని అంటున్నారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకూ ఇంటి నుంచి బయటకు రావడానికి వృద్ధులు భయపడుతున్నారు. గ్రామీణ రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనబడుతున్నాయి.

కొత్తరేవుపోలవరంలో డీఆర్‌డీఏ పీడీ పర్యటన



ఎంపీడీవోకు సూచనలిస్తున్న డీఆర్‌డీఏ పీడీ శచీదేవి

ఎస్.రాయవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్త రేవుపోలవరంలో మంగళవారం డీఆర్‌డీఏ పీడీ శచీదేవి పర్యటించారు. ఈనెల 15న ఇక్కడి సముద్రతీరంలో వెయ్యి మందితో నిర్వహించనున్న యోగాంధ్ర కార్యక్రమానికి తహసీల్దార్ జె. రమేష్‌బాబు, ఎంపీడీవో సత్యనారాయణలతో కలిసి స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 15న జరిగే యోగాంధ్రలో హోం మంత్రి వంగలపూడి అనిత, కలెక్టర్ విజయకృష్ణన్, అధికారులు, నాయకులు హాజరుకానున్నారన్నారు. అవసరమైన ఏర్పాట్లను చేయాలని ఎంపీడీవోకు ఆమె సూచించారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం శివప్రసాద్, సర్పంచ్ మల్లె లోవరాజు, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు వెంకటరాజు, సీనియర్ నాయకులు గుర్రం రామకృష్ణ, కోడ లోవరాజు, బంగారి పాల్గొన్నారు.

వంటకాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

మునగపాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మధ్యాహ్న భోజనం పథకాన్ని మానవ సేవగా భావించాలని ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు పిలుపునిచ్చారు. మండలంలో నాగులాపల్లి జడ్పీ హైస్కూల్ ఆవరణలో మంగళవారం 49 పాఠశాలల మధ్యాహ్న భోజనం పథకం కార్మికులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా వంటల పోటీలను నిర్వహించి, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. తయారు చేసిన పదార్థాలను ఎండీఎం పరిశీలకుడు బీరా ప్రసాదరావు పరిశీలించారు. కార్మికులకు వరలక్ష్మి, శ్రీదేవి శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీలు అచ్యుతకృష్ణ, లక్ష్మీనారాయణ, నూకేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు

మునగపాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఒక వ్యక్తిపై దాడికి పాల్పడిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ పి.ప్రసాదరావు తెలిపారు. మంగళవారం ఎస్ఐ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అక్కయ్యపాలెంకి చెందిన హేమాద్రి నిఖిల్ తోటాడలో ఉన్న పిన్ని ఇంటికి ఆదివారం వచ్చాడు. సోమవారం సాయంత్రం పాన్‌షాపుకు వెళ్తున్న సమయంలో అదే గ్రామానికి చెందిన రేబాక గోవర్ధన్ బూతులు తిడుతూ కామెంట్ చేశాడు. అతనితో వివాదం పడడం ఇష్టం లేక నిఖిల్ దూరంగా వెళ్లి కూర్చున్నాడు. అయినా విడిచి పెట్టకుండా నిఖిల్ పైకి గోవర్ధన్ ఇనుపరాడ్డును విసిరాడు. ఈ సంఘటనలో గాయపడిన నిఖిల్ అనకాపల్లి ఆసుపత్రిలో వైద్యం పొంది మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించండి

- మండల సమావేశంలో ఎమ్మెల్యే విజయకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయకుమార్

ఎలమంచిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యా వ్యవస్థను రాష్ట్ర ప్రభుత్వం విప్లవాత్మక మార్పులతో తీర్చిదిద్దుతుందని, ప్రతి ఒక్కరూ ప్రభుత్వ పాఠశాలలను ప్రోత్సహించాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం ఎంపీపీ బోదెపు గోవింద్ అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించేలా తీర్చిదిద్దడమే ప్రభుత్వం లక్ష్యమన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయులు అమితమైన మేధాశక్తి ఉన్న వారెందరో ఉన్నారని, వారందరి సంరక్షణలో విద్యార్థులు ఉన్నత మార్గాల్లో నిలిపనున్నామన్నారు. ప్రభుత్వ లక్ష్యాన్ని చేరేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు తమ వంతు ప్రోత్సాహం అందించాలన్నారు. అనంతరం గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా తగిన చర్యలు తీసుకోవలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ఆదేశించారు. ఎంపీపీ బోదెపు గోవింద్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా అన్ని శాఖల అధికారులు సేవలు అందించాలన్నారు. ఈ సందర్భంగా విద్యాశాఖ, ఆర్‌డబ్ల్యూఎస్ తదితర అన్ని శాఖల అధికారులు తమ నివేదికలను సమావేశంలో వినిపించారు.

సభా నియమాలకు పాతర

మండల సమావేశంలో కూర్చున్న జనసేన పార్టీ నేతలు



మండల సమావేశంలో ఉన్న ముగ్గురు జనసేన పార్టీ నేతలు (ఎడమవైపు కూర్చున్న వారు)

ఎమ్మెల్యే విజయకుమార్, ఎంపీపీ బోదెపు గోవింద్ పాల్గొన్నమండల సమావేశంలో సభా నియమాలు పాటించకపోవడం గమనార్హం. జనసేన పార్టీకి చెందిన నేతలు కొఠారు శ్రీను, ఊటకూటి రమేష్, గుర్రాల శేఖర్ సమావేశం హాలులో అధికారులతో పాటు కూర్చొన్నారు. మండల సమావేశంలో అధికారికంగా సభ్యులు, అధికారులు మాత్రమే ఉండాలి. అయితే జనసేన పార్టీకి చెందిన ముగ్గురు నేతలు సమావేశంలో కూర్చొవడం చర్చినీయాంశంగా మారింది. ఎమ్మెల్యే సమక్షంలో నిబంధనలు పాటించకపోవడంపై పలు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇక ముందు జరిగే సమావేశాల్లోనైనా సభా నిబంధనలు పాటించేలా పాలకులు, అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు సూచిస్తున్నారు.

'యోగాతో మానసిక ఒత్తిడి దూరం'



పూడిమడక తీరంలో యోగాసనాలు వేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో మానసిక ఒత్తిడి దూరం అవుతుందని ప్రముఖ యోగా శిక్షకురాలు దొరమ్మ అన్నారు. సోమవారం పూడిమడక తీరంలో యోగాంధ్రలో భాగంగా యోగాసనాలు వేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో ఆరోగ్య రుగ్మతలు రాకుండా నిరోధించవచ్చన్నారు. చిన్నప్పటి నుంచి యోగా చేస్తే జ్ఞాపకశక్తి పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మేరుగు బాపునాయుడు, మేరుగు ప్రవీణ్ కుమార్, ప్రసాద్, జాస్మిన్, రామిరెడ్డి, సౌభాగ్యలక్ష్మి, ఒరుపుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల సహకారంలో దోమల నివారణ

అచ్యుతాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): దోమల నివారణకు ప్రజలు సహకరించాలని ప్రభుత్వ వైద్యాధికారి శ్రావ్య అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంతో సోమవారం వైద్య సిబ్బంది ర్యాలీతోపాటు అచ్యుతాపురం జంక్షన్‌లో మానవహారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి కృషిచేస్తామన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సన్యాసిరావు, సహాయకుడు లండా అప్పలకొండ, డి. వరలక్ష్మి, సూర్యలక్ష్మి, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట ఎరువులతో భూసారం పెంపు

మునగపాక, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పచ్చి రొట్ట ఎరువులు భూసారాన్ని పెంచుతాయని వ్యవసాయాధికారిణి సీహెచ్.జ్యోత్స్న కుమారి తెలిపారు. మండలంలో వాడ్రాపల్లిలో జిల్లా వ్యవసాయ శాఖ సహకారంతో బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, ఏవో మోహనరావు, భూసార శాస్త్రవేత్త బి.శ్రీహరిరావు పాల్గొన్నారు.

కొబ్బరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన

నక్కపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): కొబ్బరిలో సమగ్ర యాజమాన్య పద్ధతులపై రైతులకు మంగళవారం శాస్త్రవేత్తలు, ఉద్యానశాఖాధికారులు అవగాహన కల్పించారు. మండలంలోని సీహెచ్ఎల్‌పురం, పెదతీనార్లల్లో వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా బీసీటీ కృషి విజ్ఞాన కేంద్రం నేతృత్వంలో శాస్త్రవేత్తలు అవగాహన కల్పించారు. రాజమహేంద్రవరానికి చెందిన వాణిజ్య పంటల పరిశోధనా సంస్థ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ కె.ప్రభాకర్ మాట్లాడుతూ కొబ్బరి వంటి దీర్ఘకాలిక తోటల్లో విత్తన ఎంపిక చాలా కీలకమని చెప్పారు. నాణ్యమైన రకాలు, పొట్టి రకాలను ఎంపిక చేసుకోవాలన్నారు. బీసీసీ కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు బండి నాగేంద్ర ప్రసాద్, డాక్టర్ ఎం.శివ మాట్లాడుతూ కొబ్బరిలో వచ్చే తెగుళ్ళ, యాజమాన్య చర్యలను వివరించారు. కార్యక్రమంలో పెద్దలు టి.రాము, రాజు, సత్యనారాయణ, వీరభద్రం, రాజబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పెదపల్లి వేమాంబిక జాతర



అమ్మవారిని దర్శించుకుంటున్న పప్పల చలపతిరావు

ఎలమంచిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీలోని పెదపల్లి వేమాంబిక అమ్మవారి జాతర మంగళవారం అత్యంత ఘనంగా జరుపుకున్నారు. పెదపల్లి, మంత్రిపాలెం, గొల్లల పాలెం గ్రామాల ప్రజల ఇలవేల్పు కావడంతో ఈ మూడు గ్రామాల ప్రజలు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. తెల్లవారు నుంచే అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. అమ్మవారిని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు, జనసేన పార్టీ రాష్ట్ర ప్రతినిధి సుందరపు సతీష్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే కన్నబాబు, ఎంపీపీ బోదెపు గోవింద్, తదితర నేతలంతా వేర్వేరుగా దర్శించుకున్నారు. ప్రజాప్రతినిధులకు స్థానిక నేతలు బొద్దపు శ్రీను, దాసరి కుమార్, బొద్దపు శ్రీనివాసరావు(రమణ), మాజీ కౌన్సిలర్ బొద్దపు నాగేశ్వరావు ఆలయ కమిటీ ప్రతినిధులు స్వాగతం పలికారు. సాయంత్రం అమ్మవారి ఆలయం వద్ద మహిళల కోలాటాలు, తప్పెటగుళ్లు తదితర సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

వైభవంగా దుర్గాదేవి ఆలయ వార్షికోత్సవం



ధర్మవరం అగ్రహారంలో బోనమెత్తిన మహిళలు

ఎస్.రాయవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారంలో దుర్గాదేవి అమ్మవారి ఆలయ 16 వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన మహిళలు బోనాలను నెత్తిన ఎత్తుకొని పుర వీధుల్లో ఊరేగించిన అనంతరం అమ్మవారికి సమర్పించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు అమ్మవారికి పసుపు, కుంకుమలతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటుచేశారు. వారం రోజుల పాటు ఆలయంలో హరిభజనలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కలిగట్ల మాణిక్యం, తెలుగు యువత మండల అధ్యక్షుడు సుంకర శ్రీనివాసరావు, మాజీ ఉపసర్పంచ్ సియ్యాదుల అచ్యుత్‌కుమార్, సియ్యాదుల దొంగనాయుడు, చందక రమణ, కర్రి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చోడిపల్లి అప్పారావుకి ఉత్తమ సేవా పురస్కారం



అప్పారావుని సన్మానిస్తున్న సీపీ శంక బ్రతబాగ్చి

అచ్యుతాపురం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పూడిమడక మాజీ సర్పంచ్ చోడిపల్లి అప్పారావు విశాఖ సిటీ పోలీస్ కమిషనర్ శంక బ్రతబాగ్చి చేతుల మీదుగా సోమవారం ఉత్తమ సేవా పురస్కారాన్ని అందుకున్నారు. అప్పారావు పూడిమడక వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షునిగా ఉంటూ పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. ఆయన స్వచ్ఛందంగా 45 సార్లు రక్త దానం చేశారు. విశాఖలో స్వామి వివేకానంద స్వచ్ఛంద సేవా సంస్థ ఏర్పాటుచేసిన కార్యక్రమంలో అప్పారావుని సన్మానించి మెమెంటో అందజేశారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

ఎలమంచిలి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి సహాయ నిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ అన్నారు. మంగళవారం ఎలమంచిలి జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే చేతుల మీదుగా 18 మందికి 10 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

జడ్‌పీ బాలికల హైస్కూల్ హెచ్‌ఎంగా నిర్మలకుమారి

కోటవురట్ల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు జీ నిర్మలకుమారి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన హెచ్‌ఎం యేసుదాసు చోడవరం మండలం లక్ష్మీపురం హైస్కూల్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో పరవాడ జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి జీ నిర్మలకుమారి బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఆమెకు పాఠశాల ఉపాధ్యాయులు ఘన స్వాగతం పలికారు.

గూడుపమ్మకు ప్రత్యేక పూజలు

నక్కపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేబాక గూడుపమ్మ ఆలయానికి మంగళవారం పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. కొందరు ఆలయ పరిసరాల్లో వంటలు తయారు చేసుకుని భోజనాలు చేశారు.

నేడు రాంబిల్లిలో జనవాణి

రాంబిల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 4వ తేదీన జనవాణి జరగనుందని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర మంగళవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి ఎలమంచిలి ఎమ్మెల్యే విజయకుమార్ హాజరవుతున్నారన్నారు. ఉదయం 9 గంటలు నుంచి మధ్యాహ్నం 11 గంటలు వరకు నిర్వహిస్తామని, ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురావాలని కోరారు.


పరవాడలో యోగాసనాలు వేస్తున్న డ్వాక్రా మహిళలు

'ఆరోగ్య పరిరక్షణకు యోగా చక్కని సాధనం'


సబ్బవరంలో యోగా చేస్తున్న రిసోర్స్‌పర్సన్లు

పరవాడ/సబ్బవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రతి రోజూ యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చునని పంచాయతీ విస్తరణాధికారి కె. ధర్మారావు అన్నారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో డ్వాక్రా మహిళలతో మంగళవారం యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాతో మానసిక ఒత్తిడిని జయించవచ్చన్నారు. యోగా ఆరోగ్యాన్ని పరిరక్షించడంలో కీలకపాత్ర పోషిస్తుందని వివరించారు. అనంతరం మండలస్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అచ్యుతరావు, ట్రైనీలు అరుణ, వరలక్ష్మి, సచివాలయ ఉద్యోగులు, డ్వాక్రా వీవోఏలు పాల్గొన్నారు.

ఇదిలావుంటే, సబ్బవరంలో మండల స్థాయిలో రెండువందల మంది రిసోర్స్ పర్సన్లకు యోగాపై శిక్షణ ఇచ్చారు. మంగళవారం జరిగిన ముగింపోత్సవంలో ఎంపీడీవో పి.పద్మజ మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల పరిధిలో గల గ్రామాల్లో బుధవారం నుంచి ఈనెల 18వ తేదీ వరకు యోగసానాలపై శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈనెల 21న విశాఖ ఆర్కేబీచ్‌లో ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పాల్గొనే అంతర్జాతీయ యోగా దినోత్సవానికి సబ్బవరం మండలం నుంచి 2500 మంది హాజరు కానున్నట్టు చెప్పారు.

ఏమరుపాటుగా ఉంటే.. ఏలేరు కాలువలోకే..

▸▸ బొజ్జన్నకొండ రహదారిపై ప్రయాణం భయం..భయం.. ▸▸ రక్షణ గోడలు లేక తరచూ ప్రమాదాలు ▸▸ లైట్లు వెలగక రాత్రి వేళ అంధకారం ▸▸ ఫిర్యాదులు చేసినా పట్టని అధికారులు


రాత్రివేళ లైట్లు వెలగక రోడ్డులో అంధకారం


రక్షణ గోడలు లేక ప్రమాదకరంగా దర్శనమిస్తున్న బొజ్జన్నకొండ రహదారి

తుమ్మపాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బొజ్జన్నకొండ రహదారి ప్రమాదకరంగా మారింది. దీనిని ఆనుకునే ఏలేరు కాలువ ప్రవహిస్తుంది. రహదారికిరక్షణ గోడలు లేకపోవడంతో తరచూ వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతున్నారు. అనకాపల్లి మండలం తుమ్మపాల నుంచి శంకరం జాతీయ రహదారికి గతంలో బొజ్జన్నకొండ మీదుగా దాదాపు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. దీంతో ఇక్కడ వాహనాల రాకపోకల రద్దీ పెరిగింది. క్వారీ, క్రషర్ల భారీ వాహనాలు పట్టణం మీదుగా రాకపోకలు సాగించేందుకు అనుమతులు లేకపోవడంతో సదరు డ్రైవర్లు ఈ రోడ్డునే ఆశ్రయిస్తున్నాయి. జాతీయ రహదారిని చేరుకునేందుకు ఈ రోడ్డు అత్యంత దగ్గర కావడంతో భారీ వాహనాల రాకపోకలు సైతం పెరిగాయి. అలాగే ప్రముఖ పర్యాటక కేంద్రం బొజ్జన్నకొండకు పర్యాటకులు నిత్యం వస్తుంటారు. ఇటీవల బొజ్జన్నకొండను అభివృద్ధి చేయడంతో వీరి తాకిడి మరికాస్త పెరిగింది. వేసవి సెలవుల దృష్ట్యా ప్రతి రోజూ వందలాది మంది పర్యాటకులు బొజ్జన్నకొండ సందర్శనకు వస్తున్నారు. అలాగే స్థానికులు ఈ రోడ్డులోనే ఉదయం, సాయంత్రం వాకింగ్ చేస్తుంటారు. అయితే ఈ రోడ్డును ఆనుకొని ఏలేరు కాలువ ప్రవహిస్తుండడంతో తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. బొజ్జన్నకొండ రోడ్డు, ఏలేరు కాలువకు మధ్య ఎలాంటి రక్షణ గోడలు గాని, కంచెగాని ఏర్పాటు చేయలేదు. దీంతో పలువురు వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇది సింగిల్ రోడ్డు కావడంతో పలు సందర్భాల్లో ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించే క్రమంలో అదుపుతప్పి ద్విచక్ర వాహనదారులు నేరుగా ఏలేరు కాలువలోకి దూసుకు పోయిన సంఘటలు ఉన్నాయి. క్వారీల నుంచి భారీ వాహనాలు అధిక స్పీడుతో రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో ప్రమాదాలు మరింత ఎక్కువగా జరుగుతున్నాయి. ఈ రోడ్డులో విద్యుద్దీపాలు వెలగకపోవడంతో కొత్తగా ఈ రోడ్డులో ప్రయాణించేవారు ప్రమాదాలబారిన పడుతున్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగినప్పటి నుంచి పదుల సంఖ్యలో సంఘటనలు జరిగినా అధికారులు రక్షణ గోడల నిర్మాణంపై దృష్టి సారించలేదని పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇటుగా ప్రయాణించాలంటేనే పలువురు భయాందోళన చెందుతున్నారు. తక్షణమే ఉన్నతాధికారులు స్పందించి రోడ్డుకు రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలని అంతా కోరుకుంటున్నారు.

రక్షణగా కనీసం కంచెనైనా ఏర్పాటు చేయండి



బొజ్జన్నకొండ రోడ్డులో ఎప్పటికప్పుడు ప్రమాదాలు జరుగుతున్నాయి. వీటిని నివారించేందుకు బొజ్జన్నకొండ రోడ్డు, ఏలేరు కాలువ మధ్య రక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. కనీసం ఇనుప కంచెనైనా ఏర్పాటు చేయడం ద్వారా కొంతమేర ప్రమాదాలను అరికట్టవచ్చు. ఈ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్లాం. వినాయకచవితి, శ్రీకృష్ణాష్టమి, దుర్గాదేవి నవరాత్రి వేడుకల సమయాల్లో విగ్రహాలను నిమజ్జనం చేసే క్రమంలో అధికంగా ప్రమాదాలు జరుగుతున్నాయి. తక్షణమే అధికారులు స్పందించాలి. కె.మోదినాయుడు, తుమ్మపాల

ఎన్టీపీసీ నాలుగో యూనిట్‌లో ఉత్పత్తికి అంతరాయం

పరవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి జిల్లా పరవాడలో గల సింహాద్రి ఎన్టీపీసీలో 500 మెగావాట్ల సామర్థ్యం కలిగిన నాలుగో యూనిట్‌లో మంగళవారం విద్యుదుత్పత్తికి అంతరాయం ఏర్పడింది. యూనిట్‌కు సంబంధించి బాయిలర్ ట్యూబ్‌లకు రంధ్రాలు ఏర్పడడంతో ఉత్పత్తి అర్థాంతరంగా నిలిచిపోయింది. అధికారులు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు ప్రారంభించారు. గురువారం సాయంత్రంకల్లా యూనిట్‌లో ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు కృషిచేస్తామని తెలిపారు. మిగతా ఒకటి, రెండు, మూడు యూనిట్‌లలో ఉత్పత్తి కొనసాగుతుందన్నారు.

'ఆలయాల్లో రోజూ సామూహిక హారతి'


సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ నాగపేర్రాజు

పరవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అన్ని గ్రామాల్లో గల ఆలయాల్లో సామూహిక హారతిని నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ పరవాడ సబ్ డివిజన్ కన్వీనర్ మల్లి మడుగుల నాగపేర్రాజు అన్నారు. ఇక్కడి సినిమాహాల్ జంక్షన్ వద్ద గల పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించిన ఫౌండేషన్ విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడారు. హిందూ సంస్కృతి, సాంప్రదాయాలను నేటి యువతకు తెలియజేయాలని పేర్కొన్నారు. రామాలయాల్లో ప్రతి రోజూ సామూహిక హారతితో పాటు భజనలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ దాలిబోయిన సంజీవరావు, మండల సహా కన్వీనర్ బొద్దపు నూకరత్నం, ప్రతినిధులు హేమలత, బి.కల్పన, గొర్లి ఎరుకునాయుడు, పైలా శ్రీను, బొండా గోవింద తదితరులు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి హెరిటేజ్ డెయిరీ పెద్దపీట

కశింకోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : హెరిటేజ్ డెయిరీ పాల ఉత్పత్తులు, పాడి రైతులకు అందిస్తున్న సేవలపై కశింకోటలో మంగళవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ జోనల్ మేనేజర్ వి.దివాకర్‌రావు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీకి పాలు పోస్తున్న రైతుల సంక్షేమానికి విశేషంగా కృషి చేస్తున్నట్టు చెప్పారు. పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ రూ.యాభై, ఆడపెయ్యి పుట్టేందుకు రూ.ఐదు వందలు అందించడం జరుగుతుందన్నారు. రీజనల్ మేనేజర్ పి.తులసినాయుడు మాట్లాడుతూ హెరిటేజ్ డెయిరీ జిల్లాలో అన్ని డెయిరీల కంటే ఎక్కువ రేటు చెల్లిస్తుందన్నారు. అంతేకాకుండా ప్రమాదంలో పాడి రైతు మృతి చెందితే రూ.లక్ష, సహజ మరణానికి రూ.50వేలు నామినీగా ఉన్న కుటుంబ సభ్యులకు అందజేస్తున్నట్టు వివరించారు. ఈ కార్యక్రమంలో డెయిరీ మేనేజర్ కూండ్రపు శేషు, ఆర్వీ నాయుడు పాల్గొన్నారు.

బకాయి వేతనాల కోసం ఉపాధి కూలీల ఆందోళన



బకాయిల కోసం నినాదాలు చేస్తున్న ఉపాధి కూలీలు

పరవాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : బకాయిపడిన ఎనిమిది వారాల వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం కూలీలు గొర్లివానిపాలెంలోని పని ప్రదేశంలో మంగళవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ కూలీల బకాయి వేతనాలను తక్షణమే చెల్లించాలన్నారు. కూలీల్లో ప్రతి కుటుంబానికి ఏడాదికి రెండువందల రోజుల పనిదినాలు కల్పించాలని, కొలతలతో సంబంధం లేకుండా జీవో ప్రకారం రోజుకు రూ.309లు వేతనం చెల్లించాలని, పనిముట్లను ఉచితంగా సరఫరా చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ కూలీలు లక్ష్మి, రమణమ్మ, సన్యాసమ్మ, వరలక్ష్మి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

6 నుంచి 11 వరకూ స్కూల్ రెడినెస్ ప్రోగ్రామ్ : ఎంఈవో

సబ్బవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలలు ఈ నెల 12వ తేదీ నుంచి పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఆరో తేదీ నుంచి పదకొండవ తేదీ వరకు రెడినెస్ ప్రోగ్రాం నిర్వహించనున్నామని ఎంఈవో-2 ఎంజే రవీంద్రబాబు మంగళవారం తెలిపారు. ఇందులో భాగంగా పాఠశాలల ఆవరణలు, తరగతి గదులు, బెంచీలు, బాత్‌రూమ్‌లు శుభ్రం చేయడం జరుగుతుందన్నారు. స్కూల్ ఆవరణలో పిచ్చిమొక్కలు తొలగించడం, ప్రమోట్ అయిన విద్యార్థులకు టీసీలు, రికార్డు షీట్లు ఇవ్వడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు. ఆదే విధంగా మధ్యాహ్న భోజన పథకం సిబ్బందికి శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. కార్యక్రమానికి మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలతో పాటు మధ్యాహ్న భోజన పథకం సిబ్బంది హాజరు కావాలని కోరారు.

జిల్లాను నాటుసారా రహితంగా మార్చడమే లక్ష్యం

▸▸ 'నవోదయం-2.0' అమలుపై వివిధ శాఖల అధికారుల సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్

▸▸ 151 నాటుసారా ప్రభావిత గ్రామాలను ఎ, బి, సి కేటగిరీలుగా గుర్తించినట్టు వెల్లడి



కలెక్టర్ విజయకృష్ణన్ నిర్వహించిన సమీక్షకు హాజరైన వివిధ శాఖల అధికారులు

అనకాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను నాటుసారా రహితంగా మార్చడమే నవోదయం-2.0 లక్ష్యమని, ఇందుకు అన్ని వర్గాలు సహకారం అందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కార్యాలయంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులతో కార్యక్రమం అమలుపై మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించిన 151 గ్రామాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి ఆయా గ్రామాల్లో నాటుసారా రహితంగా చేసేందుకు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. నాటుసారా తయారీ వృత్తిపై ఆధారపడిన 106 మందిని గుర్తించామన్నారు. ఆయా కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తే త్వరలోనే జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా ప్రకటించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సుర్జిత్ సింగ్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారి సుధీర్, జిల్లా అటవీ శాఖాధికారి శ్యామ్యూల్, డీపీవో శిరీషారాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీటీడబ్ల్యూవో నాగశిరీషా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రజలను మభ్యపెట్టేందుకే వైసీపీ కొత్త డ్రామాలు

▸▸ జగన్ పాలనలో ఎన్నో ఆర్థిక విధ్వంసాలు ▸▸ కప్పిపుచ్చుకునేందుకే 'వెన్నుపోటు దినం' అంటూ ఎత్తులు : మాజీ ఎమ్మెల్సీ బుద్ద


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బుద్ద నాగజగదీశ్వరరావు

అనకాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : ప్రజలను మభ్యపెట్టేందుకే వెన్నుపోటు దినం అంటూ వైసీపీ కొత్త డ్రామాలకు తెరతీస్తోందని మాజీ ఎమ్మెల్సీ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బుద్ద నాగజగదీశ్వరరావు అన్నారు. ఇక్కడి పార్టీ జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రం అన్ని రంగాల్లో వెనుకబడిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన ఏడాది కాలంలోనే రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో దూసుకుపోతున్నట్టు చెప్పారు. పేదలకు ఎన్టీఆర్ భరోసా పింఛన్ కింద రూ.నాలుగు వేలు అందిస్తున్న ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. మెగా డీఎస్సీ ప్రకటన ద్వారా త్వరంలో వేలాదిమంది నిరుద్యోగులను టీచర్లుగా నియమించనున్నారని వివరించారు. జగన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో ఎన్నో ఆర్థిక విధ్వంసాలకు పాల్పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తుండడం గొప్ప విషయంగా పేర్కొన్నారు. యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్న లక్ష్యంతో చంద్రబాబు నాయకత్వంలో రాష్ట్రానికి, జిల్లాకు అనేక పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధిని చూసి ఓర్వలేకే జగన్‌రెడ్డి వెన్నుపోటు దినం అంటూ కొత్త డ్రామాలాడుతున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకులు బోడి వెంకరావు, కుప్పిలి జగన్, విల్లూరి రమణబాబు, బర్నికాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'వైసీపీ ప్రభుత్వ పీడ విరగడై ఏడాది : నేడు వేడుకలు'

సబ్బవరం : వైసీపీ ప్రభుత్వం పీడ విరగడై, కూటమి ప్రభుత్వ సుపరిపాలన ఆరంభమై ఏడాది పూర్తవుతున్నందున బుధవారం వేడుకలు నిర్వహించనున్నట్టు పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు నియోజకవర్గమంతా ఈ వేడుకలు జరుపుకోనున్నామన్నారు. సబ్బవరం సమీపం సాయినగర్ కాలనీ యాభై అడుగుల రోడ్డులో నిర్వహించనున్న ఈ వేడుకల్లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు. సాయంత్రం ఆరు గంటలకు ఎన్టీఆర్ కూడలి వద్ద దీపాలు వెలిగించి, బాణాసంచా కాల్చుతామని వివరించారు. కూటమి నాయకులు, కార్యకర్తలతో పాటు పెద్దసంఖ్యలో ప్రజలు పాల్గొనాల్సిందిగా ఆయన కోరారు.


బ్రిడ్జిపై గంతలు పూడ్చుతున్న దృశ్యం

కొత్తూరు బ్రిడ్జిపై గుంతలు పూడ్చివేత

పోలీసు శాఖ చొరవపై పలువురు ప్రశంసలు


గుంతలపై వేసిన మెటీరియల్

కొత్తూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలం కొత్తూరు పంచాయతీలో ఉన్న కళాశాల బ్రిడ్జిపై ఏర్పడిన పెద్ద పెద్దగా గోతులను పూడ్చే కార్యక్రమాన్ని మంగళవారం జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా ఆదేశాల మేరకు చేపట్టారు. అనకాపల్లి డీఎస్పీ ఎం.శ్రావణి పర్యవేక్షణలో యంత్రాల సహాయంతో గోతులను పూడ్చి మరమ్మతులు చేపట్టారు. ముందుగా ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి రోడ్డు పనులను యుద్ధ ప్రాతిపదికన చేశారు. పలువురు ప్రయాణికులు, వాహనచోదకులు పోలీసుల చేసిన కృషిని అభినందించారు. ఇప్పటికైనా ఎప్పటికప్పుడు రహదారుల నిర్వహణ పనులను ఆ శాఖ అధికారులు చేపట్టాలని కోరుతున్నారు.

వంకర పాదాలతో పుట్టిన పిల్లలకు సత్వర వైద్యంతో సత్ఫలితాలు

▸▸ జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలాజీ



సదస్సులో డీఎంహెచ్‌వో, వైద్యాలయం సూపరింటెండెంట్ తదితరులు

కొత్తూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ క్లబ్ ఫుట్ డేను అనకాపల్లిలో నిర్వహించారు. జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రం, క్యూర్ ఇండియన్ ఇంటర్నేషనల్ సంస్థలు సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ అవగాహన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బాలాజీ, ఎన్టీఆర్ వైద్యాలయం సూపరింటెండెంట్ డాక్టర్ కృష్ణారావులు ముఖ్య అతిథులుగా మాట్లాడారు. వంకర పాదాలతో జన్మించే పిల్లలను సరైన సమయంలో గుర్తించి వారికి అవసరమైన ఫిజియోథెరఫీ, కాస్టింగ్‌లు, తినోటమీ సర్జరీలు చేపడితే వైకల్యం పూర్తిగా తొలగిపోతుందన్నారు. తద్వారా వారు ఆనందమైన జీవితాన్ని గడపవచ్చునన్నారు. ఈ ఆర్థిక సంవత్సరంలో 103 మంది పిల్లలకు ఉచితంగా సేవలు అందజేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీపీఎంవో డాక్టర్ జె.ప్రశాంతి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ ఎం.నాయక్, హెచ్‌డీఎస్ డైరెక్టర్ ఆళ్ల రామచంద్రరావు, క్యూర్ ఇండియా సిబ్బంది పాల్గొన్నారు.

మలేరియాపై అవగాహన ర్యాలీలు


తుమ్మపాలలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ సిబ్బంది

తుమ్మపాల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధిని తరిమికొట్టడమే అందరి లక్ష్యం కావాలని తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ వాణి జగదీశ్వరి పేర్కొన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం సిబ్బందితో కలిసి ఇక్కడ అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, నీటి నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ప్రతి శుక్రవారం డ్రై డేను క్రమం తప్పకుండా పాటించాలన్నారు. దోమకాటు ద్వారా వచ్చే వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ముఖ్యంగా దోమలు విజృంభించకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో మలేరియా నోడల్ అధికారి బి.సంగం, సీహెచ్‌వో శారదా, హెల్త్ ఎడ్యుకేటర్ బి. మంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


కశింకోటలో...

కశింకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో

కశింకోట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధి పట్ల ప్రజలంతా పూర్తి అవగాహన చేసుకొని తగిన జాగ్రత్తలను పాటించాలని కోరుతూ కశింకోట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ తిరుపతిరావు మాట్లాడుతూ ఇంటి పరిసరాల్లో దోమలు వృద్ధి చెందకుండా ఎప్పటికప్పుడు ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వీలైనంత వరకు దోమ తెరలు వాడుకోవడం ద్వారా మలేరియాను అరికట్టవచ్చునని వివరించారు. ఎవరికైనా తీవ్రమైన చలితో కూడిన జ్వరం, ఎక్కువగా తలనొప్పి, వాంతులు వంటి లక్షణాలు ఉంటే వెంటనే ఆరోగ్య కేంద్రాలను సంప్రదించి తగిన చికిత్స పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య కేంద్ర సిబ్బంది, సూపర్‌వైజర్లు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

'హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి'

నర్సీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత ఏడాది హాస్టళ్లలోని విద్యార్థులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ విద్యా సంవత్సరంలో పునరావృతం కాకుండా చూడాలని కోరారు. వసతి గృహాల్లో పని చేసే సిబ్బంది పోస్టుల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. విద్యా హక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్లు ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ గౌతం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.



కూలేందుకు సిద్ధంగా ఉన్న ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ భవనం



పెచ్చులూడి బీటలు వారిన భవనం శ్లాబు

వర్షం వస్తే.. వణుకే..

» శిథిల స్థితిలో కొయ్యూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ భవనం » సిబ్బంది భయాందోళన

కొయ్యూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయ భవనం శిథిలావస్థకు చేరి కూలేస్థితికి చేరింది. 2001లో అప్పటి ఎమ్మెల్యే ఎంవీవీ సత్యనారాయణ హయాంలో నిర్మించిన ఈ భవనానికి నేటి వరకు కనీస మరమ్మతులు చేపట్టలేదు. దీంతో శ్లాబు పెచ్చులు ఊడి గోడలు బీటలు బారి ఏ క్షణాన కూలుతుందోనని సిబ్బంది భయంతో విధులు నిర్వహిస్తున్నారు. సీడీపీవో కార్యాలయం, సిబ్బంది గదితో పాటు ఐసీడీఎస్‌కు సరఫరా అయ్యే సామగ్రి ఉంచేందుకు వీలుగా గొడౌన్‌లతో కలిపి నిర్మించిన ఈ భవనం వర్షాలు పడితే పూర్తిగా కారిపోతుంది. సిబ్బంది కార్యాలయంలో విధులు నిర్వహిస్తుండగా గత ఏడాది జూలై నెలలో ద్వార బంధం ఊడి కింద పడింది. ఆ సమయంలో సిబ్బంది సమీపంలో లేకపోవటంతో పెను ప్రమాదం తప్పింది. ఈ భవనం స్థానంలో నూతన నిర్మాణం చేపట్టాలని గత ప్రభుత్వ హ యాంలో పలు మార్లు ప్రతిపాదనలు ఇచ్చినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. ప్రతీ నెల ఇదే భవనంలో మండలంలోనే అంగన్‌వాడీ కార్యకర్తలు, మినీ అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రాజెక్టు సమావేశం నిర్వహిస్తుంటారు. ఈ సమయంలో పలుమార్లు శ్లాబు పెచ్చులు ఊడి పడిన ఘటనలు అనేకం ఉన్నాయి. ఐసీడీఎస్ ఉన్నతాధికారులు తనిఖీల సమయంలో శ్లాబ్ పెచ్చులు ఊ డిపడిన పరిస్థితులు ఉన్నాయి. వర్షాలు పడుతుండడంతో ఫర్నిచర్, ఇతర సామగ్రి పాడైపోతున్నాయి ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ఈ భవనాన్ని పూర్తిగా తొలగించి నూతన నిర్మాణాలకు వీలుగా నిధులు మంజూరు చేయాలని, లేకుంటే అద్దె భవనంలో కార్యాలయ నిర్వహణకు అనుమతులు అయినా ఇవ్వాలని పలువురు కోరుతున్నారు.

పలుమార్లు ప్రతిపాదనలు పంపించాం

- సీడీపీవో విజయకుమారి

నిత్యం భయంతోనే ఈ భవనంలో విధులు నిర్వహిస్తున్నాం. మరమ్మతులకైనానిధులు కేటాయించాలని పలుసార్లు ప్రతిపాదనలు పంపినా ఫలితం లేకపోయింది.వర్షాకాలం పూర్తయ్యేలోగా ఈ భవనం మరింత శిథిలమయ్యే పరిస్థితులు నెలకొన్నాయి. ఇటీవలనూతన భవన నిర్మాణానికి మళ్లీ ప్రతిపాదనలు పంపించాం. ఉన్నతాధికారులు స్పందిస్తే కష్టాలు తీరుతాయి.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే మత్స్యలింగం

అరకులోయ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో శారీరక, మానసిక ఉల్లాసం సాధ్యమని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం అన్నారు. పర్యాటక ప్రాంతాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు యోగాంధ్ర -2025లో భాగంగా మంగళవారం మ్యూజియం కళా గ్రామంలో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం, పాడేరు సబ్‌కలెక్టర్ శౌర్యమన్ పటేల్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యోగాసనాలతో సం పూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ రోజూ యోగా సాధన చేయాలన్నారు. సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్ మాట్లాడుతూ ప్రభుత్వంపర్యాటక ప్రాంతాలలో యోగాపై సంపూర్ణ అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఈ సందర్భంగా మంగళవారం ఉదయం 7 గంటలకు ప్రారంభించిన ఈ యోగాసనాల్లో స్థానిక మండల పరిధిలో ఉన్న అన్నిశాఖల అధికారులు, సిబ్బంది పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఎంవీఎస్ ప్రసాద్, డీటీలు మత్స్యరాజు, గోవింద్ , ఎంఈవో వంతల త్రినాద్‌రావు, ఐసీడీఎస్ పీవో శారద, సూపర్‌వైజర్ లక్ష్మీ, వైద్య శాఖ సిబ్బంది, పలువురు పీడీలు, వ్యాపారవేత్తలు, మ్యూజియం మేనేజర్లు మురళి, గణపతి, తదితరులు పాల్గొన్నారు.



అరకులోయలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మత్స్యలింగం

వంజంగి హిల్స్‌లో ఉత్సాహంగా యోగాంధ్ర

పాడేరు: చుట్టూ ఎత్తయిన కొండలు, పచ్చని తివాచీ పరచినట్లున్న పచ్చిక బయలుపై యోగా సాధన చేస్తే ఆ అనుభూతే వేరుగా ఉంటుంది. సరిగ్గా ఇలానేఆలోచించారు పాడేరు మండలాధికారులు. యోగాంధ్ర మాసోత్సవాల్లో భాగంగా ప్రముఖ సందర్శనీయ ప్రాంతమైన వంజంగి హిల్స్‌లో మంగళవారం యోగాసనాలు నిర్వహించారు. ప్రకృతి మధ్యలో యోగ సాధన తమకు ఎంతో ఉత్సాహం, ఆనందానిచ్చిందని ఉద్యోగులు, గిరిజనులు సంతోషం వ్యక్తం చేశారు. స్థానిక తహసీల్దార్ వి.త్రినాధరావునాయుడు, ఎంపీడీవో తేజ్‌రతన్, ఈవోపీఆర్‌డీ ఆర్‌వీ రమేశ్, వివిధ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.



వంజంగి హిల్స్‌లో యోగాసనాలు వేస్తున్న అధికారులు, గిరిజనులు

చింతపల్లి: యోగాతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని పశుసంవర్ధకశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ పి. చంద్రశేఖర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో మూడు మండలాల పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు, పశువైద్యులు యోగాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఉద్యోగులు యోగాసనాలు వేశారు. పశు వైద్యాధికారులు దేశగిరి ధమయంతి, చల్లంగి చాలినీ, వెటనరీ అసిస్టెంట్ అప్పారావు పాల్గొన్నారు.



చింతపల్లిలో ఆసనాలు వేస్తున్న పశు సంవర్ధక అధికారులు, ఉద్యోగులు

వంకర పాదాలకు ఉచిత చికిత్స



బాధిత చిన్నారులతో
ఆస్పత్రి సూపరింటెండెంట్ విశ్వామిత్ర, తదితరులు

పాడేరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ బాలల స్వాస్థ్య కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు ఉచితంగానే వంకర పాదాలకు చికిత్స చేస్తామని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సూపరిటెండెంట్ డాక్టర్ విశ్వామిత్ర అన్నారు. 'వరల్డ్ క్లబ్ ఫుట్ డే' సందర్భంగా మంగళవారం ఆస్పత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. చిన్నారులకు పాదాలు వంకరగా మారితే వాటికి చికిత్సకు ప్రైవేటు ఆస్పత్రుల్లో రూ.2 లక్షల నుంచి రూ.3లక్షలు వరకు ఖర్చు అవుతుందని, కా నీ స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిలో ఉచితంగా చికిత్సలు అందిస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఈకార్యక్రమంలో వైద్యులు ఎర్రయ్య, జగన్నాధరావు, గ్రీష్మ, వై.కిశోర్‌కుమార్, రాష్ట్రీయ బాల స్వస్థ్య ప్రతినిధి మౌనిక, పలువురు చిన్నారులు, వారి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూరిల్లు దగ్ధం



దగ్ధమైన ఇంటి వద్ద బాధిత కుటుంబం

కొయ్యూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి కొత్త బంగారమ్మపేటలో వి ద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో చింతా వరహాలుకు చెందిన పూరిల్లు దగ్ధమైంది. బాధిత కుటుంబం వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో ఇంటి నుంచి ఆకస్మాత్తుగా మంటలు చెలరేగటంతో గ్రామస్థులు అదుపు చేశారు. అప్పటికే ఈ ఘటనలో బాధిత కుటుంబానికి చెందిన రూ. 50 వేలు నగదుతో పాటు బంగారు చెవి కమ్మలు, 20 తులాల వెండి ఆభరణాలు, గృహోపకరణాలు, తిండి గింజలు కాలి బూడిదయ్యాయి. సుమారు రూ 3 లక్షల మేర ఆస్తి నష్టం వాటిల్లింది. అధికారులు ప్రమాద నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వ పరంగా సాయమందించాలని బాధితులు కోరుతున్నారు.

కొయ్యూరులో 36.5 డిగ్రీల ఉష్ణోగ్రత

పాడేరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో మంగళవారం ఎండ తీవ్రంగా కాసింది. దీంతో గరిష్ఠ ఉష్ణోగ్రతలు స్థిరంగానే కొనసాగాయి. కొయ్యూరులో 36.5 డిగ్రీల సెల్సియస్ గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదుకాగా అరకులోయలో 33.6, పాడేరులో 33.5, అనంతగిరిలో 32.8, చింతపల్లిలో 32.6, జీకేవీధిలో 31.9, పెదబయలులో 31.3, జి.మాడుగులలో 30. 8, హుకుంపేటలో 30.4, డుంబ్రిగుడలో 29.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు

చింతపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. మంగళవారం రాగల ఐదు రోజుల వాతావరణ సమాచారాన్ని శాస్త్రవేత్తలు ప్రకటించారు. జూన్ 8వ తేదీ వరకు చింతపల్లి, పాడేరు, అరకు, రంపచోడవలం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా ఒక మిల్లీమీటరు, గరిష్ఠంగా 15 మిల్లీమీటర్ల వర్షపాతంనమోదవుతుందన్నారు. గాలిలో తేమ 57-73శాతం ఉంటుందన్నారు.

6న కొయ్యూరు మండల సమావేశం

కొయ్యూరు, జూన్ 3(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఈ నెల 6వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో జీడీవి ప్రసాదరావు తెలిపారు. ఎంపీపీ బడుగు రమేశ్‌బాబు అధ్యక్షతన ఉదయం 11 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందన్నారు. జడ్పీటీసీ సభ్యుడితో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఎంపీడీవో కోరారు.

మహిళా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

» టీడీపీ పాడేరు ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఈశ్వరి

కొయ్యూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా ఎదగాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పలు పథకాలను ప్రవేశ పెడుతున్నట్టు టీడీపీ పాడేరు నియోజకవర్గ ఇన్‌చార్జి గిడ్డి ఈశ్వరి అన్నారు. మంగళవారం కాకరపాడులో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని ఈశ్వరి పలువురితో కలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వ హయాంలో మహిళ సాధికారత కల్పించడంలో విఫలమైందని ఆమె విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే దీన్ని గుర్తించి ప్రతీ మహిళ ఆర్థికంగా నిలబడాలనే దృక్పథంతో పలు శిక్షణ రకాల ఉచితంగా అందిస్తోందన్నారు. ఇందులో భాగంగా మండలానికి సంబంధించి బీసీ కార్పొరేషన్ సహకారంతో 130 మంది మహిళలకు కుట్టు శిక్షణ అందిస్తున్నట్టు చెప్పారు. మూడు నెలల శిక్షణ అనంతరం ప్రతీ మహిళకు ఉచితంగా కుట్టు మిషన్లు అందిస్తుందన్నారు. దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కార్యదర్శి తోట దొరబాబు, చింతపల్లి మండల పార్టీ అధ్యక్షుడు పూర్ణ చంద్రరావు, జీకే వీధి ఎంపీటీసీ సభ్యురాలు నాగమణి, రాజేంద్రపాలెం సర్పంచ్ సింహాచలం, నేతలు కోన సత్తిబాబు, మేడిబోయిన సత్తిబాబు, నారాయణమూర్తి పాల్గొన్నారు.

వైభవంగా ముగిసిన రాకాసమ్మ జాతర



రాకాసమ్మ నృత్య ప్రదర్శన

చింతపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లంబసింగి రాకాసమ్మ జాతర వైభవంగా ముగిసింది. మంగళవారం రాత్రి నృత్య ప్రదర్శనతో జాతర కన్నులపండువగా సాగింది. ఈ జాతర ఈనెల ఒకటో తేదీన ప్రారంభమైంది. ఆఖరి రోజు కావడంతో మంగళవారం అమ్మవారిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు అమ్మవారిని మోసుకువచ్చారు. భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. రాత్రి జ్రడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన రాకాసమ్మ నృత్య ప్రదర్శన ఆకట్టుకున్నది.

ఘనంగా మత్స్య మాడుగులమ్మ ఉత్సవం

జి.మాడుగుల: జి.మాడుగుల సంతబయలులో మంగళవారం మత్స్యమాడుగులమ్మఉత్సవం ఘనంగా నిర్వహించారు.ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక టీడీపీ సీనియర్ నేత మత్స్యరాస మత్స్యరాజు దంపతులు ఘటాలను ప్రతిష్ఠించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారి ఘటాలను తలపై మోస్తున్న మత్స్యరాజు దంపతులు

భూముల మ్యుటేషన్ వేగవంతం

» సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్



పెదజడుమురులో పెట్రోల్ బంక్ నిర్మాణానికి
స్థల పరిశీలిస్తున్న సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్

గూడెంకొత్తవీధి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి):గిరిజన ప్రాంతంలో భూముల మ్యుటేషన్ వేగవంతం చేయాలని సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్ అన్నారు. మంగళవారం మండలంలో పర్యటించిన సబ్ కలెక్టర్ పెదజడుమురు వద్ద పెట్రోల్ బంక్ స్థలాన్ని పరిశీలించారు. రింతాడ జంక్షన్ వద్ద జాతీయ రహదారి నిర్మాణాలను తనిఖీ చేశారు. ఈసందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతంలో భూములు ఇప్పటికీ తాతల పేరిట ఉన్నాయన్నారు. వారసులు వారి పేరిట మ్యూటేషన్ చేయించుకోలేదన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు పొందలేకపోతున్నారన్నారు. వారసత్వ భూములను రెవెన్యూ అధికారులు మ్యూటేషన్ చేయాలన్నారు. ఒక్కటి పెండింగ్‌లో ఉండరాదన్నారు. అలాగే కుల, ఆదాయం, ఇ తర ధ్రువపత్రాలు సకాలంలో అందజేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ, ఆర్ఐ మహదేవ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



ఆశ కార్యకర్తలతో మాట్లాడుతున్న వైద్యాధికారి హిమబిందు

సీలేరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం సీలేరు, ధారకొండ పీహెచ్‌సీల పరిధిలోని ఆశ కార్యకర్తలకు సీజనల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండంతో సీజనల్ వ్యాధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తపై ధారకొండ వైద్యాధికారి డీకే హిమబిందు వివరించారు. మారుమూల గిరిజన గ్రామాల్లో కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరాలు, అతిసారం తదితర వ్యాధులకుఎవరైనా గురైతే వెంటనే ఆసుపత్రికి తీసుకు రావాలని, లేదా తమకు సమాచారం సకాలంలో ఇవ్వాలన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కాచి వడబోసిన నీటిని తాగేలా చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలను చేయించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎస్ కె త్రినాథ్, పీహెచ్ఎన్ రాణి తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టులో విస్తృత వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో ఎస్ఐ జె.రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం విస్తృతంగా వాహన తనిఖీలు చేపట్టారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు సీఆర్‌పీఎఫ్, ఏపీఎస్పీ పోలీసులు మండల కేంద్రం మీదుగా వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. ఇటీవల అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్‌తో పాటు మావోయిస్టులు సరిహద్దు ప్రాంతాల్లో సంచరిస్తున్నారనే అనుమానంతో వాహన తనిఖీలు, గాలింపు ముమ్మరం చేసినట్లు తెలుస్తోంది. రాత్రివేళల్లో పోలీస్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నారు.

రాయితీ విత్తనాలను సద్వినియోగం చేసుకోండి: ఏవో

ముంచంగిపుట్టు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : రాయితీ వరి విత్తనాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఏవో శ్రీనివాసబాబు అన్నారు. మండలంలోనిలబ్బూరులో మంగళవారరైతులకు రాయితీ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రాయితీపై రైతులకు వరి విత్తనాలను పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఎ.సీతమ్మ, వైస్ ఎంపీపీ ఎస్.భాగ్యవతి, సర్పంచ్ గంగాధర్, టీడీపీ మండల అధ్యక్షులు కె.సన్యాసమ్మ, మాజీ సర్పంచి వి.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

జి.మాడుగుల: ఎంపీపీ లొంబోరి అప్పరాజు మంగళవారం స్థానిక వ్యవసాయకార్యాలయంలో టీడీపీ ఎస్టీసెల్ ఉపాధ్యక్షుడు సోమెలి చిట్టిబాబుతో కలిసి విత్తనాలు, ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, మండలంలోని అన్ని సచివాలయాల్లో అందుబాటులో విత్తనాలు, ఎరువులు ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏవో లకే పాత్రుడు, స్థానిక సర్పంచ్ కె.రాంబాబు, కూటమి నాయకులు కృష్ణమూర్తినాయుడు, చిట్టిబాబు, బొంజుబాబు, రామారావు, సింహాచలం, బీంబాబు తదితరులు పాల్గొన్నారు.

మత్స్య దేవత ఎఫ్‌పీవో ఆధ్వర్యంలో..



చింతపల్లి: మట్టి నమూనాలు సేకరణపై అవగాహన కల్పిస్తున్న ఏవో



ముంచంగిపుట్టులో విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏవో, ఎంపీపీ

శ్రీ మత్స్యదేవత ఎఫ్‌పీవో ద్వారా ఉచితంగా చిరుధాన్యాలైన రాగులు, సామలు, కొర్రాలు, జొన్నాలు, గంటేల విత్తనాలను మంగళవారం పెదలోచలి పంచాయతీ గిరిజన రైతులకు ఐఐఎంఆర్ ఆధ్వర్యంలో అందజేశారు. సంప్రదాయంగా పంటల సాగుకు ప్రోత్సాహంగా ఉచితంగా ఏటా ఈ విత్తనాలు పంపిణీ చేసినట్టు తెలిపారు. డా.రఫీ, మత్స్యదేవత ఎఫ్‌పీవో సీఈవో ఐ. హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలు చేయించుకోవాలి: ఏవో

చింతపల్లి:గిరిజన రైతులు భూసార పరీక్షలు చేయించుకోవాలని ఏవో శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం బలపం గ్రామ పంచాయతీ కేంద్రంలో ఆపరేషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా గంజాయి సాగుకు వ్యతిరేకంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పొలాల్లో భూసార పరీక్షలపై మట్టి సేకరణపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ గిరిజనులు భూసార పరీక్షలు ఆధారంగా సాగు చేయడం వల్ల నాణ్యమైన, అధిక దిగుబడులు పొందచ్చునన్నారు. ప్రభుత్వం పచ్చిరొట్ట, రాజ్‌మా, వరి విత్తనాలను 90శాతం రాయితీపై పంపిణీ చేస్తోందన్నారు. రైతులు గంజాయి సాగుకి దూరంగా ఉంటూ, వ్యవసాయ పంటలపై దృష్టి సారించాలన్నారు. ఈకార్యక్రమంలో స్థానిక సర్పంచ్ రమేశ్ నాయుడు, సిబ్బంది వసుపరి సౌందర్య పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ కొత్త డ్రామా

» ఆర్టీసీ విజయనగరం జోన్ చైర్మన్ దొన్నుదొర, జీసీసీ చైర్మన్ శ్రావణ్



మాట్లాడుతున్న విజయనగరం ఆర్టీసీ జోన్ చైర్మన్ దొన్నుదొర

అరకులోయ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక వైసీపీ అధినేత జగన్‌మోహన్‌రెడ్డి మతిలేని నిరసన కార్యక్రమాలకు పిలుపునిస్తున్నారని విజయనగరం జోన్ ఆర్టీసీ చైర్మన్, టీడీపీ అరకు ఇన్‌చార్జి సియారి దొన్నుదొర, జీసీసీ చైర్మన్, టీడీపీ అరకు పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి కిడారి శ్రావన్‌కుమార్ అన్నారు. మంగళవారం ఇద్దరు నేతలు వేర్వేరుగా అరకులోయలో విలేకర్లతో మాట్లాడారు. జగన్‌రెడ్డి వెన్నుపోటు రాజకీయాలు చేసి తల్లిని, చెల్లిని ఇంటి నుంచి వెళ్లగొట్టారన్నారు. పలు పథకాల పేరుతో డ బ్బును దోచుకుతిని ప్రజలకు వెన్నుపోటు పొడిచింది జగన్ రెడ్డియేనని విమర్శించారు. ఆయన పాలనలో అవినీతి, అక్రమాలు ఒక్కోటిగా దర్యాప్తు సంస్థలు బట్టబయలు చేస్తున్నాయన్నారు. ఆ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో అక్రమాలకు పాల్పడిన నేతలు, అధి కారులు సైతం చట్టపరమైన విచారణలు ఎదుర్కొంటున్నారన్నారు. చివరకు ప్రజలకు అన్ని విధాల వెన్నుపోటు పొడిచిన జగన్‌రెడ్డి చట్టం ముందు దోషిగా నిలబడే రోజు అతి త్వరలోనే వస్తుందన్నారు. జగన్‌రెడ్డి పిలుపులకు ప్రజలు స్పందించరన్నారు. తాను ఇచ్చిన హామీలలో 10 శాతం మాత్రమే ఆయన అమలు చేశారన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత 70 శాతం హామీలను అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడిదుర అన్నారు. దొన్నుదొర తన నివాసగృహంలో అరకులోయ, డుంబ్రిగుడ మండలాల టీడీపీ అధ్యక్షులు లకోయ్‌మహదేవ్, ఆనంద్, పెదలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, కస్టర్ ఇన్‌చార్జిలు నీరజ, గంగ, నాయకులు పాల్గొన్నారు. శ్రావణ్‌కుమార్ నిర్వహించిన సమావేశంలో బాకూరు వెంకటరమణ, జనసేన అరకు ఇన్‌చార్జి చిరంజీవి, మాజీ వైస్ ఎంపీపీ అమ్మన్న, సూర్యకాంతం, జనసేన నేత శ్రీనివాస్‌రెడ్డి, దారెల సర్పంచ్ పాండురంగస్వామి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.


డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో లేక గిరిజనం అవస్థలు



బూదరాళ్ల సచివాలయం ఎదుట నిరీక్షిస్తున్న గిరిజనులు

కొయ్యూరు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): బూదరాళ్ల గ్రామ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ అందుబాటులో లేక పోవటంతో మంగళవారం రేషన్‌కార్డుఆధార్ లింకు, మొబైల్ యాడింగ్ తదితర పనుల కోసం వచ్చిన పలు గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బంది ఎదుర్కొన్నారు. కొందరు నిరాశతో వెనుతిరిగి పోగా, మరికొందరు ఇక్కడికి మరో 30 కిలో మీటర్ల దూరంలో అంతాడ గ్రామ సచివాలయానికి వెళ్లి పనులు పూర్తి చేసుకున్నారు. బూదరాళ్ల సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ పాటి లావణ్య గత కొన్ని రోజులుగా పంచాయతీ ప్రజలకు అందుబాటులో ఉండటం లేదు. దీంతో ప్రభుత్వం ఇటీవల రేషన్‌కార్డుల లబ్ధిదారులు మొబైల్, ఆధార్ యాడింగ్‌లతో పాటు నూతన కార్డులకు దరఖాస్తులకు వీలుకాలేదు. ఈ బూదరాళ్ల పంచాయతీలో చేరిన సచివాయంనకు సుమారు 40 కిలోమీటర్ల పైబడి దూరంలో గల నూకరాయితోట, ముకుడుపల్లి, కిండంగి తదితర గ్రామాల ప్రజలు డిజిటల్ అసిస్టెంట్‌ను ఫోన్‌లో సంప్రదించి మరీ సచివాలయానికి చేరుకున్నారు. అయినా, డీఏ సచివాలయంలో అందుబాటులో లేకపోవటంతో మరోసారి సంప్రదించగా తాను వారంరోజుల పాటు సెలవులో ఉన్నట్టు సమాధానమివ్వటంతో ఎన్నో వ్యయ ప్రయాసలతో వచ్చిన గిరిజనం నిరాశతో వెనుతిరిగాల్సి వచ్చింది. కొందరు అంతాడ గ్రామ సచివాలయంకు రేషన్ కార్డు యాడింగ్‌కు వెళ్లారు. ఈ విషయమై ఎంపీడీవో ప్రసాద్‌ను ఫోన్‌లో సంప్రదించగా డీఏ గత వారంలో రెండు రోజులు సెలవు పెట్టినట్టు చెప్పారు. అయితే, ప్రస్తుతం ప్రభుత్వ నిర్ణయం మేరకు ప్రజా సంబంధ పనులు అనేకం ఉన్నాయని సూచించానన్నారు. అయినా, డీఏ విధులకు గైర్హాజరు కావటంపై మెమో ఇచ్చి సమాధానం తీసుకుంటామన్నారు. ఇప్పటికైనా ఆమె స్థానంలో వేరొకరిని డిప్యుటేషన్‌పై నియమించాలని పంచాయతీ వాసులు కోరుతున్నారు.

షిర్డీ సాయి విగ్రహ పునఃప్రతిష్ఠా మహోత్సవాలు



విగ్రహం ఊరేగింపులో భక్తులు

డుంబ్రిగుడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కించుమండ సంతబయలులో షిర్డీ సాయిబాబా విగ్రహం పునః ప్రతిష్ఠామహోత్సవాలను మంగళవారం నుంచి గురువారం వరకు నిర్వహించనున్నట్టు కమిటీ ప్రతినిధులు మోహనరావు, రమేశ్, బుద్దు, బుల్లిబాబు, బాలకృష్ణ తెలిపారు. జాతీయ రహదారి వి స్తరణలో భాగంగా ఆలయ ప్రాంగణాన్ని తొలగిం చారు. ఈ నే పథ్యంలో పునర్నిర్మించారు. మంగళవారం విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా విఘ్నేశ్వర పూజ చేశారు. కోలాటాలతో స్వామి వారికి ఊరేగించారు.

ఆర్‌అండ్‌బీ స్థలాలను ఖాళీ చేయాలి: తహసీల్దార్

చింతపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఆర్‌అండ్‌బీ స్థలాలను మూడు రోజుల్లో ఖాళీ చేయాలని స్థానిక తహసీల్దార్ టి. రామకృష్ణ ఆదేశించారు. మంగళవారం సంతబయలు వద్ద రెవెన్యూ అధికారులు అక్రమ కట్టడాలను గుర్తించారు. కొలతలు వేసి ఆర్‌అండ్‌బీ స్థలాల్లో నిర్మించిన కట్టడాలను తొలగించాలని ఆదేశించారు. తహసీల్దార్ ఈ కట్టడాలను స్వయంగా పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధుల అభ్యర్థన మేరకు అక్రమ కట్టడాలను స్వచ్ఛందంగా తొలగించుకునేందుకు గడవు ఇచ్చామన్నారు. ఈనేపథ్యంలో మార్కు చేసిన మేరకు స్థలాన్ని ఖాళీ చేయాలన్నారు. లేకుంటే కట్టడాలను కూల్చివేస్తామన్నారు. ఈకార్యక్రమంలో వర్తక సంఘం ప్రధాన కార్యదర్శి పెదిరెడ్ల బేతాళుడు, హెచ్‌డబ్ల్యూవో పసుపులేటి వినాయకరావు, జీసీసీ ఉద్యోగుల సంఘం నాయకుడు దురియా హేమంత్, వర్తకులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలో చేరిక



టీడీపీలో చేరిన వారితో పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల,తదితరులు

గొలుగొండ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాలికమల్లవరం పంచాయతీ వెంకటాపురం గ్రామంలో 20మంది వైసీపీ కార్యకర్తలు సోమవారం రాత్రి టీడీపీలో చేరారు. వీరికి పార్టీ మండల అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు కండువాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడు మాట్లాడుతూ శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు నియోజకవర్గంలో చేపడుతున్న అభివృద్ధిని చూసి చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు చిటికెల సాంబమూర్తి, గ్రామ పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరావు, మాజీ సర్పంచులు కొల్లాన కొండలరావు, సుర్ల సీతారామమూర్తి తదితరులు నాయకులు పాల్గొన్నారు.

'హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి'



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్

నర్సీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ వసతి గృహాల్లో విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రామ్మోహన్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడు తూ గత ఏడాది హాస్టళ్లలోని విద్యార్థులు అనేక సమస్యలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, ఈ విద్యా సంవత్సరంలో పునరావృతం కాకుండా చూడాలని కోరారు. వసతి గృహాల్లో పని చేసే సిబ్బంది పోస్టుల ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గత ఏడాది పెండింగ్‌లో ఉన్న డైట్ బిల్లులు తక్షణమే విడుదల చేయాలని కోరారు. విద్యాహక్కు చట్టాన్ని ఉల్లంఘిస్తూ కార్పొరేట్ కళాశాలలు, స్కూళ్ల ఫీజులు అధికంగా వసూలు చేస్తున్నాయని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఎం.బాలాజీ గౌతం, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

'కృష్ణాదేవిపేట జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు'

కృష్ణాదేవిపేట, జూన్ 3(ఆంధ్రజ్యోతి) : గొలుగొండ మండలం కృష్ణాదేవిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అడ్మిషన్లు జరుగుతున్నట్టు పిన్సిపాల్ కె.శ్రీహరి మంగళవారం తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పాసైన విద్యార్థులు అర్హులుగా పేర్కొన్నారు. కళాశాలలో తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో అడ్మిషన్లకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. బైపీసీ, ఎంపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూపులు ఉన్నట్టు చెప్పారు. ప్రతి గ్రూపునకు ఏటా మంచి అడ్మిషన్లు వస్తున్నాయని, వీటిని దృష్టిలో పెట్టుకొని విద్యార్థులు ముందుగా అడ్మిషన్లు పొందాలని సూచించారు. ఈ కళాశాలలో చదివిన ఎందరో విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలవడంతో పాటు నేడు ఉన్నత చదువులు చదువుతుండడంతో పాటు మరి కొందరు బాగా స్థిరపడ్డారన్నారు. కళాశాలలో పూర్తిస్థాయిలో అధ్యాపకులు, ఫర్నీచర్ తదితర సౌకర్యాలు అందుబాటులో ఉన్నట్టు వివరించారు. అర్హులంతా అడ్మిషన్లు పొందాల్సిందిగా ఆయన కోరారు.

చెత్త సమస్యకు త్వరలో చరమగీతం

▸ రెండు కొత్త ట్రాక్టర్లు, కంపాక్టర్, ఎక్స్‌కవేటర్ కొనుగోలు చేసిన మునిసిపాలిటీ



కొత్తగా కొనుగోలు చేసిన ట్రాక్టర్లు



ప్రస్తుతం మునిసిపాలిటీ పరిధి బలిఘట్టం యార్డులో చెత్త

నర్సీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీలో చెత్త సమస్యకు పరిష్కార దిశగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం రూ.కోటి వెచ్చించి కొత్త వాహనాలు కొనుగోలు చేస్తున్నారు. బలిఘట్టం కంపోస్ట్ యార్డులో పేరుకు పోయిన 6,300 మెట్రిక్ టన్నుల (లెగసీ వేస్ట్) చెత్తను కాకినాడ జిల్లా తుని తరలించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. మునిసిపాలిటీలో ప్రతి రోజూ 30 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుంది. అందులో తడి చెత్త 16 టన్నులు, 14 టన్నులు పొడి చెత్త ఉంటుంది. మూడు నెలల క్రితం విశాఖపట్నం కాపులుప్పాడలో గల జిందాల్ చెత్త నుంచి విద్యుత్ తయారీ కేంద్రానికి 300 మెట్రిక్ టన్నుల చెత్తను తరలించారు. మిగిలిన 6.300 మెట్రిక్ టన్నుల చెత్తను తుని తరలించడానికి తరుణి సంస్థతో ఒప్పందం కుదిరింది. డంపింగ్ యార్డులోని చెత్త మొత్తం తరలించడం పూర్తయిన తర్వాత రోజువారీ చెత్తను పోగులు పెట్టకుండా ఎప్పటికప్పుడు తుని తరలిస్తారు. బలిఘట్టం సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ పార్కులోని డంపింగ్ యార్డులో చెత్త తరలించే వాహనాలు తిరగడానికి వీలుగా రూ.27 లక్షల అంచనాలతో సీసీ రోడ్డు నిర్మాణం చేస్తున్నారు. రూ.13 లక్షలో డ్రైనేజీ కాలువలు, కల్వర్టు, ఇతర మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నారు. చెత్త తరలించేందుకు రెండు కొత్త ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్, కంపాక్టర్, పుష్‌కార్ట్స్, చెత్త డబ్బాలు కొనుగోలు చేస్తున్నారు. వార్డులలో తడి, పొడి చెత్త వేర్వేరుగా సేకరించడానికి పుష్‌కార్ట్స్, 500 చెత్త డబ్బాలు కొనుగోలుకు టెండర్ల ప్రక్రియ పూర్తి చేశారు. రెండు కొత్త ట్రాక్టర్లు కొనుగోలు చేశారు. ఇవి పూర్తిగా అందుబాటులోకి వస్తే వినియోగంలో ఉన్న మూడు అద్దె ట్రాక్టర్ల కాంట్రాక్ట్ రద్దు చేస్తారు. ప్రతి నెలా ట్రాక్టర్‌లకు చెల్లించే అద్దె డబ్బులు ఆదా అవుతాయి.

దోమల నియంత్రణతో రోగాలు దూరం

▸ అవగాహన ర్యాలీలో పీహెచ్‌సీల వైద్యాధికారులు



గొలుగొండలో ర్యాలీ నిర్వహిస్తున్న పీహెచ్‌సీ వైద్యులు, సిబ్బంది

గొలుగొండ/కృష్ణాదేవిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : దోమల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యతని గొలుగొండ, కృష్ణాదేవిపేట పీహెచ్‌సీల వైద్యాధికారులు డాక్టర్ శ్యామ్‌కుమార్, డాక్టర్ ఎస్.గాయిత్రి అన్నారు. మలేరియా నివారణ మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆయా గ్రామాల్లో అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతకు అంతా అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అప్పుడే దోమల వ్యాప్తిని అరకట్టవచ్చునని చెప్పారు. ప్రతి ఒక్కరూ దోమల తెరలు వాడాలని సూచించారు. ముఖ్యంగా నీరు నిల్వలేకుండా చూసుకోవడం చాలా అవసరంగా పేర్కొన్నారు. ప్రతి శుక్రవారం గ్రామాల్లో డ్రై డే పాటించి, ఆరోగ్యంగా జీవించాలన్నారు. రానున్నది వర్షాకాలం కావడంతో ఆరోగ్య పరిరక్షణకు అంతా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

నేడు కూటమి ఏడాది సుపరిపాలనపై సంబరాలు



సమావేశంలో మాట్లాడుతున్న జనసేన నియోజకవర్గ నాయకుడు వీర సూర్యచంద్ర

నర్సీపట్నం అర్బన్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఏర్పాటై బుధవారం నాటికి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా వేడుకలు జరుపుకోనున్నట్టు జనసేన పార్టీ నియోజవర్గ ఇన్‌చార్జి రాజాన వీర సూర్యచంద్ర తెలిపారు. నర్సీపట్నంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. పట్టణంలోని రామారావు పేట సెంటర్ వద్ద మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తామన్నారు సాయంత్రం ఆరుగంటల నుంచి దీపాలంకరణతో పాటు ఏడాది సుపరిపాలనలో ప్రవేశపెట్టిన పథకాలు, అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరిస్తామన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి జిల్లా జనసేన ఉపాధ్యక్షుడు వూడి చక్రవర్తి, వైస్ ఎంపీపీ రమణ, పార్టీ మండల అధ్యక్షుడు దొరబాబు, పంచాడ హరినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ బైక్ ర్యాలీకి పోలీసులు అనుమతి నిరాకరణ

నర్సీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల హామీలు అమలు చేయడం లేదని ఆరోపిస్తూ బుధవారం వైసీపీ చేపట్టనున్న బైక్ ర్యాలీకి పట్టణ పోలీసులు అనుమతి నిరాకరించారు. దీంతో కాలి నడకన సీబీఎం కాంపౌండ్ నుంచి ఆర్డీవో కార్యాలయానికి వెళ్లి వినతి పత్రం సమర్పించనున్నామని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర గణేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. నియోజవర్గంలోని వైసీపీ నాయకులు, కార్యకర్తలు సీబీఎం కాంపౌండ్‌కు తరలి రావాల్సిందిగా ఆయన కోరారు.

జిల్లాను నాటుసారా రహితంగా మార్చడమే లక్ష్యం

▸ 'నవోదయం-2.0' అమలుపై సమీక్షలో కలెక్టర్ విజయకృష్ణన్

▸ 151 నాటుసారా ప్రభావిత గ్రామాలను కేటగిరీలుగా గుర్తించినట్టు వెల్లడి



అనకాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి) : జిల్లాను నాటుసారా రహితంగా మార్చడమే నవోదయం-2.0 లక్ష్యమని, ఇందుకు అంతా సహకారమందించాలని కలెక్టర్ విజయకృష్ణన్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ కార్యాలయంలో ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారులతో కార్యక్రమం అమలుపై మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా ప్రభావిత గ్రామాలుగా గుర్తించిన 151 గ్రామాలను ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి ఆయా గ్రామాల్లో నాటుసారా రహితంగా చేసేందుకు తీర్మానాలు చేయడం జరిగిందన్నారు. నాటుసారా తయారీ వృత్తిపై ఆధారపడిన 106 మందిని గుర్తించామన్నారు. ఆయా కుటుంబాలకు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలను చూపాలని ఆదేశించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ సుర్జిత్ సింగ్, జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖాధికారి సుధీర్, జిల్లా అటవీ శాఖాధికారి శ్యామ్యూల్, డీపీవో శిరీషారాణి, డీఆర్‌డీఏ పీడీ శచీదేవి, డీటీడబ్ల్యూవో నాగశిరీషా వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మాజీ వలంటీర్, బైక్ మెకానిక్ మధ్య కొట్లాట

బుచ్చెయ్యపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఐతంపూడి గ్రామంలో మాజీ వలంటీర్, బైక్ మెకానిక్ మధ్య కొట్లాట జరిగింది. దీనికి సంబంధించి బుచ్చెయ్యపేట ఎస్ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాలు ఇలా వున్నాయి. ఐతంపూడి గ్రామానికి చెందిన బొబ్బిలి రవీంద్ర బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మాజీ వలంటీర్ అయితిరెడ్డి చిన్ననాయుడుతో పాత గొడవలు వున్నాయి. మంగళవారం ఉదయం చిన్ననాయుడు.. మెకానిక్ షాపు వద్దకు వచ్చి రవీంద్రతో గొడవపడ్డాడు. దీంతో ఇద్దరి మధ్య కొట్లాట జరిగి గాయపడ్డారు. అనంతరం వేర్వేరుగా పోలీసులకు ఫిర్యాదు చేశారు. క్షతగాత్రులను వైద్య పరీక్షల కోసం అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఘనంగా గ్రామ దేవతల పండగలు



ఎరకాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్సీ చిరంజీవిరావు

దేవరాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో సన్యాసమ్మ ఒడ్డు పండగ, రైవాడ ఎరకామ్మ పెద్ద పండగలను గ్రామస్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఎరకాలమ్మ గ్రామ దేవతను ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు దర్శించుకొని, పూజలు చేశారు. ఉదయం నుంచి అమ్మవారిని భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఎంఎల్‌సీ గాదె శ్రీనువాసులనాయుడు తదితరులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

దోమల నిర్మూలనపై వైద్య సిబ్బంది మానవహారం



దేవరాపల్లిలో మానవహారం నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

దేవరాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతతో దోమల నియంత్రణ సాధ్యమని వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు అన్నారు. మంగళవారం వారు మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించిన అనంతరం నాలుగు రోడ్ల కూడలిలో మానవహారంగా ఏర్పడ్డారు. ప్రతి శుక్రవారం డ్రై డే పాటిద్దాం అంటూ నినాదాలు చేశారు. వైద్యాధికారి వనజ, సీహెచ్‌ఓ ఆనంద్, పుష్పరాజు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం

చీడికాడ, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): యోగాతో ఆరోగ్యం బాగుంటుందని పంచాయతీ కార్యదర్శులు పీలా పద్మావతి, ఇంటి సింహాచలం నాయుడు, ఎ.సన్యాసిరావు, నాగేశ్వరరావు, వీర్రాజు అన్నారు. మంగళవారం మండలంలోని కోనాం, ఖండివరం, అప్పలరాజుపురం, జైతవరం, బైలపూడితోపాటు అన్ని గ్రామ సచివాలయాల్లో మండల టీవోటీలకు యోగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ దరఖాస్తులకు ఆమోదం

బుచ్చెయ్యపేట జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో అన్నదాత సుఖీభవ పథకానికి 21,862 దరఖాస్తులకు అప్రూవల్ చేశామని వ్యవసాయాధికారి భాస్కరరావు తెలిపారు. మండలంలో 24,854 ఆన్‌లైన్ దరఖాస్తులు వచ్చాయని, వివిధ కారణాలతో 2003 దరఖాస్తులను రెవెన్యూ అధికారుల విచారణకు పంపామన్నారు. అలాగే మృతులు, ప్రభుత్వ ఉద్యోగులు, ఇతర అనర్హులుగా 984 దరఖాస్తులను తిరస్కరించామని తెలిపారు.

పంపిణీకి సిద్ధంగా పచ్చి రొట్ట విత్తనాలు

దేవరాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో 20 రైతు సేవా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయాధికారి ఎల్‌వై. కాంతమ్మ తెలిపారు. జీలుగు 6 క్వింటాలు, జనుము 24 క్వింటాలు, జనుము, జీలుగ, పిల్లిపెసర, కలిపి ఉన్నవి ఆరు క్వింటాలు సిద్ధంగా ఉన్నాయన్నారు. పచ్చిరొట్ట విత్తనాలు ఎకరాకు పది కిలోలు వరకు వేసుకొని 45 రోజులు వచ్చిన తరువాత భూమిలో కలియదున్నాలన్నారు. నవ ధాన్యాలు కూడా 1 లేదా రెండు కిలోలు కలిపి దున్నితే భూమి సారవంతం అయి పంట దిగుబడి వస్తుందన్నారు.

జన్నవరం రహదారిని వీడని గ్రహణం

▸ పలు గ్రామాల ప్రజల అవస్థలు



అధ్వానంగా ఉన్న చోడవరం-జన్నవరం రహదారి

చోడవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు పంచాయతీలకు కీలకమైన చోడవరం-జన్నవరం రహదారి అభివృద్ధి అర్ధంతరంగా ఆగిపోవడంతో అనేక గ్రామాల ప్రజలు అవస్థలు పడుతున్నారు. వైసీపీ హయాంలో ఐదేళ్లు కాలక్షేపం చేసి, ఎన్నికలకు కొన్ని నెలల ముందు రహదారి అభివృద్ధికి శంకుస్థాపన చేసి కొంత మేర పనులు చేసి వదిలేశారు. ఈలోగా ఎన్నికలు అయిపోవడంతో రహదారి పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత పట్టణంలోని కొత్తూరు జంక్షన్ నుంచి ఓ అరకిలోమీటరు మేర, పీఎస్ పేట సమీపంలో 300 మీటర్ల మేర సీసీ రోడ్డు పనులు చేపట్టారు. మిగిలిన రోడ్డంతా ఎలాంటి అభివృద్ధి లేకుండా అలాగే ఉండిపోయింది. గతంలో ఈ రోడ్డు అభివృద్ధికి మంజూరైన నిధులు కూడా వెనక్కి మళ్లిపోయినట్టు సమాచారం. నియోజకవర్గ కేంద్రంలోని ప్రధాన పంచాయతీలైన బెన్నవోలు, చాకిపల్లి, కన్నంపాలెం, తిమ్మనపాలెంతోపాటు, బుచ్చెయ్యపేట మండలాలను కలిపే ఈ రహదారి దుస్థితి ఏళ్ల తరబడి మెరుగుపడకపోవడంతో ఈ రూట్లో తిరిగే వాహనదారులు, స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతుకులమయంగా ఉన్న ఈ రహదారి రాత్రివేళల్లో మరింత ప్రమాదకరంగా ఉంటుందని స్థానికులు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి జన్నవరం రోడ్డుకు మోక్షం కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

హైరిస్క్ గర్భిణులను ముందుగా ఆస్పత్రిలో చేర్చాలి : డిప్యూటీ డీఎంహెచ్‌వో



సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి

రావికమతం ,జూన్3 (ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ గ్రామాలలో హైరిస్క్ గర్భిణులను గుర్తించి ప్రసవానికి పది రోజుల ముందే ఆసుపత్రిల్లో చెర్పించాలని డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ జ్యోతి అన్నారు. మంగళవారం ఆశా డే సందర్భంగా కొత్తకోట పీహెచ్‌సిలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. వర్షాలు కురుస్తున్నందున గ్రామాలలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, ముందు చర్యలు తీసుకోవాలన్నారు. ఏజెన్సీలో మలేరియా బారిన పడకుండా విధిగా దోమ తెరలు వాడాలని, వేడి నీటినే తాగాలని, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అవగాహన కల్పించాలన్నారు. అనంతరం ఆసుపత్రిలో రికార్డులను పరిశీలించి, ఓపీని మరింత పెంచాలని వైద్యాధికారిణి సురేఖకు సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి పి.రామారావు,హెచ్ఎస్.రమణ,సిబ్బంది,ఆశాలు పాల్గొన్నారు.

ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి

మాడుగుల రూరల్, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఉక్కపోతతో ప్రజలు ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఇటీవల వర్షాలు పడినప్పటికీ వేడిమి, ఉక్కపోత ఏ మాత్రం తగ్గలేదు. ఎండ ఓ మాదిరిగా కాసినా ఉక్కపోత మాత్రం ఉక్కిరిబిక్కిరి చేస్తున్నది. మధ్యాహ్నం సమయాల్లో మరింత ఇబ్బంది పడుతున్నారు. గాలాడక చెట్ల కిందకు వెళ్లినా సేదతీరే పరిస్థితులు కనిపించడం లేదు. ఇళ్లల్లో ఫ్యాన్ల కింద ఉన్నా చెమటధారలు ఆగడం లేదు. వర్షాలు, ఎండ ఉక్కపోత వెరసి తట్టుకునేందుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వృద్ధులు, చిన్నారులు ఉక్కపోతకు తట్టుకోలేక అల్లాడిపోతున్నారు.

9వ తేదీ వరకు దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే

రావికమతం, జూన్3 (ఆంధ్రజ్యోతి): ఈనెల 9వ తేదీ వరకు మండలంలో దివ్యాంగ విద్యార్థుల గుర్తింపు సర్వే నిర్వహిస్తున్నామని ప్రత్యేక ఉపాధ్యాయుడు బి.మహాలక్ష్మినాయుడు తెలిపారు. ప్రతి గ్రామ సచివాలయం,అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో ఇంతవరకు గుర్తించలేని 0 నుంచి 18 సంవత్సరాలలోపు గల దివ్యాంగులను ఈ సర్వే ద్వారా గుర్తిస్తామన్నారు. వారు ఇంతవరకు పాఠశాలలో జాయిన్ కాకుంటే చేర్పించడం జరుగుతుందన్నారు. మండలంలో ఇప్పటికి 12 మందిని గుర్తించామన్నారు. ఈ కార్యాక్రమంలో మరో ప్రత్యేక ఉపాధ్యాయుడు జగన్నాథనాయుడు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ అందించాలి

రోలుగుంట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో రేషన్ డిపో-1ను మంగళవారం ఉదయం తహసీల్దార్ నాగమ్మ తనిఖీ చేశారు. లబ్ధిదారులకు సక్రమంగా సరకులను అందించాలని డీలర్‌ను ఆదేశించారు. అదేవిధంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు, సాయంత్రం 4 నుంచి రాత్రి 8 వరకు డీలర్లు అందుబాటులో ఉంచి రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు. అలాగే 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు ఇళ్ల వద్దకే రేషన్ అందించాలని కోరారు. ఆయన వెంట డీటీ శంకరరావు, ఆర్ఐ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నేడు చౌడువాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

కె.కోటపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం చౌడువాడలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈపీడీసీఎల్ ఏఈ చంద్రశేఖర్ తెలిపారు. గుండుపాలెం ఫీడర్‌కు సంబంధించి చౌడువాడ, మల్లంపాలెం గ్రామాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలి

▸ ప్రజా వాగ్గేయకారుడు ఉదయ్ భాస్కర్



గడుసు తుమ్మెదలు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సంఘ సభ్యులు

దేవరాపల్లి, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ జీవిత చరిత్రను పాఠ్యాంశంగా చేర్చాలని ప్రజా వాగ్గేయకారుడు ఉదయ్ భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ కాలనీలో దళిత సాహిత్యం గడుసు తుమ్మెదలు పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేడ్కర్ పోరాట చరిత్రను 2025లో 50 వేలు పుస్తకాలను ప్రజలకు ఉచితంగా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాటపల్లి అప్పారావు, మాలి బాబు, కంచిమాల అప్పారావు ఉల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

న్యాయ విద్యార్థుల అపూర్వ కలయిక



ఒకచోట చేరిన లా కళాశాల విద్యార్థులు

చోడవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): వారంతా విశాఖలోని ఆల్వార్ దాస్ న్యాయ విద్యాపరిషత్ లా కళాశాలలో 1993 సంవత్సరం బ్యాచ్ విద్యార్థులు. మూడు దశాబ్దాల క్రితం కలిసి చదివిన వారంతా మంగళవారం చౌడువాడలో కలిశారు. ఈ స్నేహితులంతా తమ కాలేజీ ముచ్చట్లు, యోగక్షేమాలు, కుటుంబ వివరాలు ఒకరితో ఒకరు పంచుకున్నారు. కాలేజీ రోజుల్లో చేసిన అల్లరిని గుర్తు చేసుకుంటూ తీపి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. ప్రతి ఏడాది కలవాలని నిర్ణయం తీసుకున్నారు. స్థానిక బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కాండ్రేగుల డేవిడ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులు ఆసక్తి చూపించాలి

కె.కోటపాడు, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయం పై రైతులు ఆసక్తి కనబరచాలని మండల వ్యవసాయ అధికారి సోమశేఖర్ అన్నారు. మండలంలోని ఉగ్గినవలసలో మంగళవారం నూరు శాతం రైతులు ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టేలా రైతులను ప్రోత్సహించాలన్నారు. వారాడ గ్రామంలో నవధాన్యాలు సాగు చేస్తున్న పంటలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ కో-ఆర్డినేటర్ ఎం. నాయుడు, వ్యవసాయ సిబ్బంది పూజిత, కళ్యాణి, స్నేహ, కృష్ణవేణి పాల్గొన్నారు.

వృద్ధులు, దివ్యాంగులకు రేషన్ పంపిణీ

రావికమతం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలలో వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రేషన్‌ను డీలర్లు పంపిణీ చేస్తున్నారు. మండలంలోని చినపాచిల, కేబీపీ అగ్రహారం, గుమ్మాళ్ళపాడు, రావికమతం, గర్నికం, మేడివాడ, దొండపూడి, కుముదానిపేట, కొత్తకోట తదితర గ్రామాల రేషన్ డీలర్లు వృద్ధులు, దివ్యాంగుల ఇళ్లకు వెళ్లి రేషన్ సరకులను అందజేస్తున్నారు. ఇకపై ప్రతి నెలా ఇంటి వద్దకే నేరుగా రేషన్ సరకులను అందజేస్తామని డీలర్లు తెలిపారు. రావికమతం, మేడివాడ డిపోల పరిధిలో ఇంటింట రేషన్ పంపిణీని తహసీల్దార్ బి.వెంకట రమణ పర్యవేక్షించారు.

మండల స్థాయిలో యోగా పోటీలు

బుచ్చెయ్యపేట జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో 10 నుంచి 18 ఏళ్ల వయస్సు ఉన్నవారికి మంగళవారం మండల స్థాయి యోగా పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో ముగ్గురు బాలురు, ముగ్గురు బాలికలు సూర్య నమస్కారాలు, ప్రాణాయమం, ధ్యానం విభాగాలలో ఎంపికయ్యారన్నారు. వీరు జిల్లా స్థాయిలో పాల్గొంటారని ఎంపిడీవో విజయలక్ష్మి తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై తహసీల్దార్‌కు ఫిర్యాదు

రావికమతం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోని శాశ్వత నిర్మాణాలు చేపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని టి.అర్జాపురం గ్రామస్థులు తహసీల్దార్ బి.వెంకటరమణకు మంగళవారం ఫిర్యాదు చేశారు. బీఎన్ రోడ్డు నుంచి గ్రామంలో రామాలయం వరకూ వెళ్లే ప్రభుత్వ స్థలాన్ని గ్రామానికి చెందిన యర్రంశెట్టి రామునాయుడు దురాక్రమణ చేసి, శాశ్వత నిర్మాణాన్ని చేస్తున్నారన్నారు. ఇదే విషయమై నాలుగేళ్ల క్రితం అప్పటి తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయగా.. అక్రమ నిర్మాణాన్ని ఆపేశారన్నారు. అప్పట్లో నిలిపేసిన నిర్మాణాన్ని మళ్లీ నిర్మిస్తున్నారన్నారు. వీఆర్‌వో చెప్పిన నిర్మాణాన్ని ఆపలేదన్నారు. ఫిర్యాదు చేసిన వారిలో వైస్ ఎంపీపీ మత్స భవానీ ప్రసాద్, జనసేన గ్రామ అధ్యక్షుడు శీతిన శివ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు రాజాన అప్పలనాయుడు, మత్స వెంకటరమణ ఉన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో నేలకు సారం


జనుము పైరు

పుష్కలంగా నత్రజని, భాస్వరం లభ్యం

- భూమి బాగా గుల్లబారి నీటి నిలువ శక్తి పెరుగుతుంది
- సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి
- పంటలకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుంది
- 50 శాతం రాయితీపై విత్తనాలు అందిస్తున్న ప్రభుత్వం

సబ్బవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): **పచ్చిరొట్ట సాగుతో భూసారం పెరుగుతుంది. పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు వేసిన 40 రోజుల తరువాత భూమిలో కలియదున్నడం ద్వారా నేలకు సేంద్రీయ పదార్థాలు, నత్రజని, భాస్వరం వంటి పోషకాలు అందుతాయి. తద్వారా భూసారం పెరిగి పంట దిగుబడులు పెరుగుతాయి. సేంద్రీయ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం 50 శాతం రాయితీపై రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందిస్తున్నది.**

పంట సాగులో రసాయన ఎరువులను అధికంగా వాడడం వల్ల నేలలో వుండే మిత్ర పురుగులు, పంటలకు మేలుచేసే సూక్ష్మజీవులు నశిస్తాయి. భూసారం కూడా తగ్గిపోతుంది. పోషకాలు లోపించి, పంటలను చీడపీడలు త్వరగా ఆశిస్తాయి. నేల తన సహజ భౌతిక లక్షణాలను కోల్పోయి, కొంతకాలం తరువాత పంటల సాగుకు పనికిరాకుండా పోతుంది. ఈ పరిస్థితిని అధిగమించేందుకు రైతులు పచ్చిరొట్ట పైర్లను సాగు చేయాలని వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. పచ్చిరొట్ట ఎరువుగా జనుము, జీలుగ, పిల్లిపెసర వేసుకోవచ్చు. పొలంలో ఖరీఫ్ పంటలు వేయడానికి నెలన్నర ముందు పొలంలో పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి. ఈ ప్రకారం జిల్లాలో వరి సాగు చేసే రైతులు ఈ నెలలోనే పచ్చిరొట్ట విత్తనాలు వేసుకోవాలి. పచ్చిరొట్ట పైరు 45 నుంచి 50 రోజులు వున్నప్పుడు పొలంలో నీరుంటే సరే, లేదంటే నీరు పెట్టుకుని నేలలో కలియదున్నాలి. 15 నుంచి 22 సెంటీమీటర్ల లోతులో కలియదున్నుకుంటే నత్రజని వృథాగా పోకుండా ఉంటుంది. పచ్చిరొట్ట ఎరువు భూమిలో నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతుంది. వర్షాభావ పరిస్థితులను పంటలు తట్టుకుంటాయి. పచ్చిరొట్ట ఎరువుల వినియోగం వల్ల సూక్ష్మజీవులు వృద్ధి చెందుతాయి. పంటలకు నష్టం కలిగించే పురుగులు దూరమవుతాయి. రసాయన ఎరువుల వాడకం తగ్గడం ద్వారా ఖర్చులను తగ్గించవచ్చును. సేంద్రీయ వ్యవసాయానికి పచ్చిరొట్ట ఎరువు చాలా ఉపయోగపడుతుంది. పచ్చిరొట్ట మొక్కలు గాలిలోని నత్రజనిని గ్రహించి భూమిలోకి తీసుకునివెళ్లే స్వభావం కలిగివుంటాయి.


ఏపుగా పెరిగిన జీలుగ పైరు

జనుము

నీరు ఇంకిపోయే తేలికపాటి ఎర్ర నేలలు, ఇసుకు నేలల్లో వేసుకోచ్చు. ఎకరానికి 10-15 కిలోల విత్తనం అవసరం. ఎకరాకు 10 టన్నుల వరకు దిగుబడి వస్తుంది. పూతదశలో 45-50 రోజులకు కలియదున్నాలి. పది టన్నుల పచ్చిరొట్ట ఎరువు నుంచి 50 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 40 కిలోల పొటాష్ లభిస్తాయి.

జీలుగ

అన్ని రకాల నేలల్లో జీలుగ వేసుకోవచ్చు. ఎకరాకు 12-15 కిలోల విత్తనం అవసరం. జీలుగ మొక్కల వేర్లమీద నత్రజని నిల్వచేసే బుడిపెలు వుంటాయి. విత్తిన 50-55 రోజుల్లో పైరును నేలలో కలియదున్నాలి. ఎకరాకు 12 నుంచి 14 టన్నుల వరకు పచ్చిరొట్ట లభిస్తుంది. పది టన్నుల పచ్చిరొట్ట ఎరువు నుంచి 50 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 25 కిలోల పొటాష్ లభిస్తాయి.

పచ్చిరొట్ట ఎరువుతో బహుళ ప్రయోజనాలు



పచ్చిరొట్ట ఎరువు సాగుతో బహుళ ప్రయోజనాలు కలుగుతాయి. నేలకు అవసరమైన నత్రజని, భాస్వరం సహజసిద్ధంగా అందుతాయి. భూమి బాగా గుల్లబారి సారం పెరుగుతుంది. తద్వారా పైరుకు అవసరమైన నీటిని, పోషక పదార్థాలను నిల్వ ఉంచుకునే శక్తి పెరుగుతుంది. మొక్కలకు సూక్ష్మపోషక పదార్థాల లోపం ఏర్పడదు. సూక్ష్మజీవులు అభివృద్ధి చెందుతాయి. పంటలకు చీడపీడలను తట్టుకునే శక్తి పెరుగుతుంది. రసాయన ఎరువుల వాడకం తగ్గడం వల్ల పెట్టుబడులు ఆదా అవుతాయి. నాణ్యమైన పంట దిగుబడి వస్తుంది.

- పోతల సత్యనారాయణ, ఏవో, సబ్బవరం

పిల్లిపెసర

ఇది నల్లరేగడి నేలల్లో బాగా పెరుగుతుంది. నీటి ఎద్దడితోపాటు అధిక నీటిని కూడా తట్టుకోగలదు. ఎకరానికి 5-6 కిలోల విత్తనం అవసరం. నాలుగు వారాల్లో మొక్కలు త్వరగా పెరుగుతాయి. తరువాత నెమ్మదిస్తుంది. పూతదశ... అంటే 50-55 రోజుల్లో నేలలో కలియదున్నాలి. పది టన్నుల పచ్చిరొట్ట ఎరువు నుంచి 30 కిలోల నత్రజని, 12 కిలోల భాస్వరం, 28 కిలోల పొటాష్ లభిస్తాయి.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు

రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై జీలుగ, జనుము, పిల్లిపెసరతోపాటు మిశ్రమ పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తున్నది. రాయితీపోను జీలుగ కిలో రూ.61.50, జనుము రూ.54.5, పిల్లిపెసర రూ.90 చొప్పున రైతులు తమకు సమీపంలో వున్న రైతు సేవా కేంద్రాల నుంచి పొందవచ్చు.

క్రైం... crime news

పాలగెడ్డలో మునిగి యువకుడి మృతి

- కాలకృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లి మృత్యువాత


కెరటాల రోషన్ (ఫైల్ ఫొటో)

మాడుగుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): పాలగెడ్డలో కాల కృత్యాలు తీర్చుకోవడానికి వెళ్లిన ఒక యువకుడు.. ప్రమాదవశాత్తూ కాలుజారి నీటిలో పడిపోయాడు. అక్కడే వున్న స్నేహితుడు కాపాడడానికి చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో నీట మునిగి మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి వివరాలిలా వున్నాయి. విశాఖ నగరంలోని అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన కెరటాల రోషన్ (18) మంగళవారం చీడికాడ మండలం ఖండివరం గ్రామానికి చెందిన తన స్నేహితుడి ఇంటికి వచ్చాడు. ఇతని (స్నేహితుడి) తాత మాడుగులలో ఉండడంతో ఇక్కడ జరుగుతున్న మోదకొండమ్మ అమ్మవారి జాతరను తిలకించేందుకు ఇద్దరూ కలిసి మాడుగుల వచ్చారు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో కాలకృత్యాలు తీర్చుకు నేందుకు పాలగెడ్డకు వెళ్లారు. రోషన్ ప్రమాదవశాత్తూ నీటిలో పడిపోయి మునిగిపోతూ కేకలు వేశాడు. ఒడ్డున ఉన్న స్నేహితుడు కాపాడడానికి ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. దీంతో రోషన్ నీటిలో మునిగిపోయాడు. అగ్నిమాపక శాఖకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి గాలించారు. కొద్దిసేపటి తరువాత మృతదేహాన్ని బయటకు తీశారు. ఈ విషయం తెలుసుకున్న రోషన్ కుటుంబ సభ్యులు సంఘటన స్థలానికి చేరుకొని కన్నీరుమున్నీరయ్యారు.

తల్లీకొడుకుల అదృశ్యంపై ఫిర్యాదు

కృష్ణాదేవిపేట, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): గొలుగొండ మండలం అమ్మపేట గ్రామానికి చెందిన తల్లీకొడుకు అదృశ్యమైనట్టు పోలీసులకు ఫిర్యాదు అందింది. గొలుగొండ ఎస్ఐ పి.రామారావు తెలిపిన వివరాలిలా వున్నాయి. అమ్మపేట గ్రామానికి చెందిన నాగశివ భార్య జయ(25), ఆమె కుమారుడు విగ్నేశ్ (16 నెలలు) గత నెల 31వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లకు వెళ్లి వెతికినా ఫలితం లేకపోయింది. దీంతో నాగశివ గొలుగొండ ఎస్ఐ పి.రామారావుకు ఫిర్యాదు చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

ఎస్.రాయవరం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జేవీపాలెం గ్రామానికి చెందిన ఒక వ్యక్తి ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ విభీషణరావు తెలిపిన వివరాల మేరకు.. జేవీపాలెం గ్రామానికి చెందిన వజ్రపు శ్రీనివాసరావు(34) విజయవాడలోని ఒక హాస్టల్‌లో కుక్‌గా పనిచేస్తున్నాడు. కొద్దిరోజుల క్రితం అక్కడ ఉద్యోగం మానేసి తిరిగి వచ్చేశాడు. ఆర్థిక ఇబ్బందులతోపాటు ఇల్లు నిర్మించుకోలేకపోయానన్న మనస్తాపంతో మంగళవారం పశువుల పాకలో ఉరి వేసుకున్నాడు. కొద్ది సేపటి తరువాత గమనించిన స్థానికులు వెంటనే కిందకు దించి చూడగా అప్పటికే ప్రాణాలు కోల్పోయాడు. మృతుడి భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

రెండు టన్నుల రట్టన్ కేన్ విత్తనాలు స్వాధీనం


అటవీ అధికారులు స్వాధీనం చేసుకున్న రట్టన్ కేన్ విత్తనాలు

నర్సీపట్నం, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి అటవీ డివిజన్‌లో పెదవలస రేంజ్ నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న రెండు టన్నుల రట్టన్ కేన్ విత్తనాలను నర్సీపట్నం రేంజ్ అధికారులు స్వాధీనం చేసుకొన్నారు. ఇందుకు సంబంధించి రేంజర్ అందించిన వివరాలిలా ఉన్నాయి. పెదవలస నుంచి రట్టన్ కేన్ విత్తనాల లోడుతో బయలుదేరిన వ్యాన్‌ను ఆదివారం గొలుగొండ మండలం చీడిగుమ్మల చెక్‌పోస్టు వద్ద అటవీ సంరక్షణ అధికారి స్వామినాయుడు ఆపారు. డ్రైవర్ దగ్గర పెదవలస రేంజర్ సంతకంతో తేదీ వేయని సీఎఫ్ 140(సీఫీజు) రశీదు ఉంది. ఇంతకు మించి ఎటువంటి పత్రాలు లేకపోవడంతో అరిలోవ అసిస్టెంట్ బీట్ అధికారి ఎం.రమణకు సమాచారం ఇచ్చారు. ఆయనకు అనుమానం వచ్చి ఈ విషయాన్ని నర్సీపట్నం రేంజ్ అధికారి లక్ష్మినర్సు దృష్టికి తీసుకెళ్లారు. వ్యాన్‌ను నర్సీపట్నం కలప డిపోకి తరలించారు. గొలుగొండ మండలం జానకిరామపురం గ్రామానికి చెందిన వ్యాన్ డ్రైవర్ కొరుప్రోలు సత్తిబాబును రేంజర్ విచారించి అతని దగ్గర నుంచి వాంగ్మూలం తీసుకున్నారు. పెదవలస రేంజ్ పరిధిలోని కన్నవరం గ్రామంలో రట్టన్ కేన్ విత్తనాలను కొనుగోలు చేసినట్టు విచారణతో తేలింది. వీటిని ఎస్.రాయవరం మండలం చిన్నగుమ్మలూరు గ్రామానికి, అక్కడి నుంచి ఒడిశాకు రవాణా చేస్తారని డ్రైవర్ చెప్పాడు. దేవుళ్ల మాలాధారణ దండల తయారీకి రట్టన్ విత్తనాలను పూసలుగా ఉపయోగిస్తారు.

ఘనంగా మాడుగుల మోదకొండమ్మ జాతర


విశేష అలంకరణలో మోదకొండమ్మ అమ్మవారు


ఘటాలతో క్యూలైన్‌లో భక్తులు

మాడుగుల, జూన్ 3 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్య దైవం మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా జరిగింది. వేకువ జాము ఐదు గంటల నుంచి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు ఘటాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని ఆలయ కమిటీ ప్రతినిధులు అన్ని ఏర్పాట్లు చేశారు. సాయంత్రం 6 గంటలు దాటిన తరువాత సతకంపట్టు వద్ద కొలువుతీరిన అమ్మవారి పాదాలు, ఘటాలను గ్రామంలో ఊరేగింపుగా తిప్పి, తిరిగి ఆలయానికి తీసుకువచ్చారు. ఊరేగింపు సందర్భంగా నేల వేషాలు, బల్ల వేషాలు ఏర్పాటు వేశారు. భారీగా మందుగుండు సామగ్రి పేల్చారు. బస్టాండ్, దుర్గాలమ్మ ఆలయం, సతకంపట్టు వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్ఐ జి.నారాయణరావు పర్యవేక్షణలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి దంపతులు, అనకాపల్లి ఎంపీ సీఎం రమేశ్, కార్పొరేషన్ డైరెక్టర్లు పీలా గోవింద్ సత్యనారాయణ, బత్తుల తాతయ్యబాబు, పీవీజీ కుమార్, అలాగే సత్యవతి, పీవీఎన్ మాధవ్, కోట్ని బాలాజీ, బండారు అప్పలనాయుడు, ఆడారి ఆనందబాబు తదితరులు అమ్మవారిని దర్శించుకు న్నారు. వారిని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, కమిటీ సభ్యులు సాదరంగా ఆహ్వానించి అమ్మవారి దర్శనం అనం తరం శాలువాతో సత్కరించి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు.

పోటెత్తిన భక్తులు


సతకంపట్టు నుంచి బయలుదేరిన అమ్మవారి ఘటాలు

వాక రోడ్డుకి మోక్షం

... 5వ పేజీ తరువాయి

కొంతమేర అటవీ ప్రాంతం వుండడంతో పక్కా రహదారి నిర్మాణానికి పర్యావరణ పరంగా అడ్డంకులు వున్నాయి. దీనివల్ల రోడ్డు నిర్మాణం వీలుకాలేదు. ఈ విషయం స్పీకర్ అయ్యన్నపాత్రుడు దృష్టికి రావడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రోడ్డు నిర్మాణానికి అటవీ భూమి ఎంత అవసరం వుంటుందో.. అంతే భూమిని వేరేచోట రెవెన్యూ శాఖ ద్వారా అటవీ శాఖకు బదలాయించాలని ప్రతిపాదించారు. దీనికి ప్రభుత్వం నుంచి సానుకూల స్పందన వచ్చింది. ఇందులో భాగంగా జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ శనివారం మండలంలో పర్యటించిన సందర్భంగా ఈ విషయం ప్రకటించారు. రామన్నపాలెం సెంటర్ నుంచి ఎరకన్నపాలెం మీదుగా ఎలమంచిలి మునిసిపాలిటీ పరిధిలోని పెద్దపల్లి వద్ద జాతీయ రహదారి వరకు సుమారు 10 కిలోమీటర్ల పొడవున 40 అడుగుల వెడల్పుతో రోడ్డు నిర్మాణం చేపట్టనున్నట్టు వెల్లడించారు. రామన్నపాలెం నుంచి తాళ్లపాలెం మీదుగా ఎలమంచిలి వరకు 23 కిలోమీటర్ల దూరం వుండగా, ఎరకన్నపాలెం మీదుగా రోడ్డు నిర్మాణం పూర్తయితే సుమారు 13 కిలోమీటర్ల దూరం తగ్గుతుంది. కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు ఈ రోడ్డు పనులపై పరిశీలన చేస్తున్నారు. రామన్నపాలెం సెంటర్ నుంచి సుమారు మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణం కోసం అల్యూమినియం కంపెనీ యాజమాన్యం గతంలో ఏపీఐఐసీకి డబ్బులు చెల్లించింది. ఈ మూడు కిలోమీటర్ల రోడ్డును ఏపీఐఐసీ చేపడుతుంది. మిగిలిన సుమారు ఎనిమిది కిలోమీటర్ల రోడ్డును ఆర్అండ్‌బీ అధికారులు నిర్మిస్తారు. మధ్యలో రెండు కిలో మీటర్లు అటవీ ప్రాంతం వుంది. అటవీ భూమికి ప్రత్యామ్నాయంగా వేరేచోట రెవెన్యూ భూమి ఇవ్వనున్నట్టు తెలిసింది. తొలుత రామన్నపాలెం జంక్షన్ నుంచి మూడు కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని త్వరగా చేపట్టాలని ఏపీఐఐసీ అధికారులను కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశించారు. తరువాత మిగిలిన రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు తయారు చేసి, ప్రభుత్వ ఆమోదానికి పంపుతారు. అనుమతులు వచ్చిన వెంటనే టెండర్లు పిలిచి, పనులు ప్రారంభిస్తారని తెలిసింది.

రెండు రోజుల్లో 32 శాతం రేషన్ పంపిణీ

... 5వ పేజీ తరువాయి

రేషన్ షాపు పరిధిలో సరుకుల పంపిణీపై ఆమె ఆరా తీశారు. రేషన్ షాపులో తనిఖీలు నిర్వహించిన కలెక్టర్.. తూకంలో తేడాలు లేకుండా రేషన్ పంపిణీ చేయాలని డీలర్‌ను ఆదేశించారు. దివ్యాంగులు, వయోవృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ పంపిణీ గురించి తెలుసుకున్నారు. అనంతరం దివ్యాంగులు, వృద్ధులైన విరోతి నాగయ్యమ్మ, కోట నాగమ్మ, చిత్త చంద్రమ్మ, బొడ్డు మంగవేణిల ఇళ్లకు వెళ్లి సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ, జిల్లాలో 1069 రేషన్ షాపుల ద్వారా ప్రతి నెల ఐదు లక్షల 30 వేల కార్డుదారులకు సరుకులు పంపిణీ చేస్తామనిఇ చెప్పారు. ఒకటి, రెండు తేదీల్లో 32 శాతం కార్డులకు రేషన్ పంపిణీ పూర్తయ్యిందని చెప్పారు. జిల్లాలో దివ్యాంగులు, ఇంటి నుంచి కదలలేని స్థితిలో ఉన్న వారు, 65 సంవత్సరాలు దాటిన వారు సుమారు 66 వేల మంది ఉన్నారని, ఐదో తేదీలోగా ఆయా రోజుల్లో మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల లోపు రేషన్ డీలర్లు వీరి ఇళ్ల వద్దకు వెళ్లి సరుకులు పంపిణీ చేస్తారని తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో షేక్ ఆయిషా, జిల్లా సరఫరాల అధికారి కేఎల్ఎస్ మూర్తి, తహసీల్దార్ బి.విజయ్‌కుమార్, తదితరులు వున్నారు.

జిల్లాలో ఆటిజం కేంద్రాలు

... 5వ పేజీ తరువాయి

నేర్పేందుకు పట్టణ ప్రాంతాల్లో ప్రైవేటు వ్యక్తులు, సంస్థలు పాఠశాలలు నడుపుతున్నారు. వీటిల్లో అధిక మొత్తంలో ఫీజులు వసూలు చేస్తుండడంతో ఆర్థిక స్తోమత లేని తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ పాఠశాలల్లో చేర్పించలేకపోతున్నారు. దీంతో ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. సమగ్ర శిక్ష విభాగం ఆధ్వర్యంలో ప్రతి మండలానికి ఒకటి చొప్పున జిల్లాలో 24 భవిత కేంద్రాలు నడుస్తున్నాయి. వీటిల్లో చదువుకుంటున్న వారిలో 105 మంది చిన్నారులు ఆటిజంతో బాధపడుతున్నట్టు గుర్తించారు. అయితే వీరికి ఆటిజం విద్య పూర్తిస్థాయిలో అందడం లేదు. వీరి కోసం ఎలమంచిలి, నర్సీపట్నంలో ఆటిజం కేంద్రాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఒక్కో కేంద్రానికి రూ27 లక్షల చొప్పున నిధులు మంజూరు చేసింది. ఆటిజం కేంద్రాలను ప్రారంభించడానికి సమగ్ర శిక్ష అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. భవనాలు నిర్మించి, బోధకులను నియమించి, అవసరమైన పరికరాలను సమకూరుస్తామని సమగ్ర శిక్ష ఏపీసీ డాక్టర్ జయప్రకాశ్ తెలిపారు. ఇప్పటికే కొనసాగుతున్న భవిత కేంద్రాల్లో బోధకులకు ఆటిజం విద్యాబోధనపై ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహించేందుకు ప్రభుత్వ అనుమతి కోరామన్నారు.

పయనీర్ కంపెనీలో రష్యా బృందం పర్యటన

- యాజమాన్యం మారుతోందని జోరుగా ప్రచారం


పయనీర్ కంపెనీ

మాకవరపాలెం, జూన్ 3(ఆంధ్రజ్యోతి): మండలంలోని పయనీర్ (అల్యూమినియం కంపెనీ) యాజమాన్యం మారుతోందన్న ప్రచారం జోరుగా సాగుతున్న. మంగళవారం ఈ కంపెనీని రష్యా బృందం సందర్శించడం దీనికి బలం చేకూరుస్తున్నది. అల్యూమినియం కంపెనీ ఏర్పాటు కోసం 2007-08లో 2,450 ఎకరాల భూమిని అప్పటి యాజమాన్యం తీసుకుంది. భూములు, ఇళ్లు కోల్పోయిన వారికి తామరం రెవెన్యూలో 150 ఎకరాల్లో పునరావాస కాలనీ ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలను మంజూరు చేసింది. మరోవైపు రూ.5,600 కోట్లతో 1,800 ఎకరాల్లో కంపెనీ నిర్మాణం చేపట్టారు. చింతపల్లి ఏజెన్సీ నుంచి ముడి సరుకు (బాక్సైట్) తీసుకురావడానికి ప్రయత్నించగా.. అప్పట్లో గిరిజనులు పెద్ద ఎత్తున ఆందోళనలు చేశారు. దీంతో కొన్ని సంవత్సరాలపాటు కంపెనీ ప్రారంభంకాలేదు. వైసీపీ ప్రభుత్వ హయాంలో కంపెనీ యాజమాన్యం ఆస్ట్రేలియా నుంచి బాక్సైట్ ముడి ఖనిజాన్ని దిగుమతి చేసుకుని 2020లో పనులు ప్రారంభించింది. అప్పటి నుంచి 2023 వరకు అన్‌రాక్ కంపెనీ పేరుతో నిర్వహిస్తున్నారు. అయితే 2023 చివరిలో కంపెనీ పేరును పయనీర్‌గా మార్పు చేశారు. కొంత కాలం తరువాత కంపెనీలో ముఖ్యమైన ఉద్యోగులను మార్పు చేసుకుంటూ వచ్చారు. ఇందులో భాగంగా ఇరవై రోజుల క్రితం కంపెనీ వైస్ ప్రెసిడెంట్‌గా ఉన్న ఎల్ఎస్ రావు స్థానంలో కృష్ణయాదవ్‌ను నియమించారు. ఇప్పుడు కంపెనీలో అత్యధిక వాటా ఉన్న రష్యాకు చెందిన ఒక కంపెనీకి పూర్తిగా అప్పజెప్పినట్టు ప్రచారం జరుగుతున్నది.

డబుల్ డెక్కర్ బస్సు సిద్ధం



పర్యాటకులను ఆకర్షించేందుకు బీచ్ రోడ్డులో డబుల్ డెక్కర్ బస్సు నడపనున్నారు. ఇది పూర్తిగా అద్దాలతో ఉంటుంది. ఇందులో కూర్చొని ప్రయాణిస్తూ బీచ్ అందాలను ఆస్వాదించవచ్చు. దీనిని ఆర్‌కే బీచ్ నుంచి భీమిలి వరకు నడపనున్నారు. ప్రస్తుతం ఈ బస్సు సింహాచలం దేవస్థానం గోశాల వద్ద ఉంది. - విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి

నత్తనడకన రోడ్ల పనులు

... 5వ పేజీ తరువాయి

రుణం రూ.220 కోట్లతో పనులను చేపట్టాల్సి ఉండగా, ఇప్పటివరకూ కేవలం రూ.24.56 కోట్ల విలువైనవి మాత్రమే పూర్తయ్యాయంటే ఎంత మందకొడిగా సాగుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వేగం లేకపోవడం, ఇతర కారణాల వల్ల మంజూరైన పనులు రద్దయ్యే అవకాశం ఉందంటున్నారు. అయితే, దీనిపై అధికారులు మాత్రం పెదవి విప్పడం లేదు. ఇదిలావుంటే మొత్తం పది పనుల్లో రెండు పనులు ఇప్పటివరకూ ప్రారంభమే కాలేదు. మిగిలిన ఎనిమిది కూడా పది శాతం మాత్రమే పూర్తయ్యాయి.

మొత్తం 87.74 కిలోమీటర్లు మేర రోడ్ల విస్తరణ, మరమ్మతులు చేపట్టేందుకు ప్రభుత్వం ఎన్‌డీబీ నుంచి రూ.220.62 కోట్ల రుణం తీసుకుంది. అయితే, ఈ ఏడాది మార్చి ఒకటో తేదీ నాటికి రూ.24.56 కోట్ల విలువజేసే పనులను మాత్రమే పూర్తిచేశారు. వీటికి సంబంధించి రూ.15.32 కోట్ల బిల్లులను చెల్లించగా, మరో రూ.1.16 కోట్ల విలువజేసే బిల్లులు సీఎఫ్ఎంఎస్‌లో పెండింగ్‌లో ఉన్నాయి. మిగిలిన బిల్లులు చెల్లించాల్సి ఉంది.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	90.00
లైవ్ ధర	110.00
విత్ స్కిన్	190.00
స్కిన్ లెస్	200.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	535
విజయనగరం	539
శ్రీకాకుళం	539